# ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం

రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# ఆధ్యాత్మిక పురోగతికి
# ప్రధాన శత్రువు-సోమరితనం



**రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

మొదటి ముద్రణ : అక్టోబరు, 2026
ప్రతులు : 1,000

**వెల : రూ. 50/-**

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.70/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) "అహం దేహోస్మి" నుంచి "అహం బ్రహ్మోస్మి" అనే స్థితికి ఎదగాలి | - | రూ.70/- |
| 12) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 13) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 14) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 15) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 16) పంచకోశాలు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మాయకు వశమైనవాడి లక్షణాలు | - | రూ.60/- |
| 22) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? | - | రూ.60/- |
| 23) దుఃఖానికి కారణం | - | రూ.60/- |
| 24) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 26) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 28) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 29) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 30) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 31) ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం | - | రూ.50/- |
| 32) భగవంతుని కృప | - | రూ.50/- |
| 33) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 34) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |
| 35) మనస్సు యొక్క స్థితులు | - | రూ.40/- |

# ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం

ఈ ఆధ్యాత్మిక జీవితంలో అడుగుపెట్టి, మీరు ఎలా ఎదగాలి? ఎలా ఎదిగితే ఆత్మ దర్శనం కలుగుతుంది? ఏ విధంగా ముందుకు సాగాలి అనే విషయాలను ప్రతి క్షణం అన్వేషిస్తూ, రోజురోజుకు కొత్త విషయాలను తెలుసుకోవాలనే తపనతో ముందుకు సాగుతున్నారంటే, మీరు ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందే అవకాశం అంతగా పెరుగుతుంది. మీలో తెలుసుకోవాలనే తపన ఎంత బలంగా ఉంటే, అంతగా మీ ఆత్మ ఎదుగుదల జరుగుతుంది. కానీ "నేను సాధన చేస్తున్నాను, ఇంతకంటే ఇంకా ఏం చేయాలి? ఈ జీవితానికి ఇది చాలు" అని మీరు అనుకుంటే మాత్రం మీలో ఆధ్యాత్మిక పురోగతి ఆగిపోతుంది.

ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు సాగకుండా వెనక్కి లాగే ప్రధాన కారణాల్లో మనిషిలో ఉండే 'సోమరితనం' ఒకటి. సాధకుడికి బయట ఉన్న శత్రువుల కంటే, తనలో ఉన్న సోమరితనమే పెద్ద అడ్డంకిగా మారుతుంది. మీరు ఆధ్యాత్మిక పురోగతి సాధించాలంటే ఈ సోమరితనాన్ని తప్పకుండా అధిగమించాలి. చాలామంది "ధ్యానం చేస్తే మంచిదే" అనే ఉద్దేశంతో ధ్యానం చేస్తారు. కానీ ఆ ధ్యానం వల్ల తనలో జ్ఞానం పెరగాలి, ఆ జ్ఞానాన్ని మరింతగా తెలుసుకోవాలి, సత్యాన్ని ఇంకా లోతుగా అర్థం చేసుకోవాలి అనే తపన చాలామందిలో కనిపించదు. ధ్యానం కుదురుతుందా? లేదా? ఎంతసేపు చేయాలి? అనే విషయాల గురించే ఎక్కువగా ఆలోచిస్తారు.

కానీ "ధ్యానం ద్వారా నా మనసు శుద్ధి కావాలి, ఆ శుద్ధమైన మనసు ద్వారా జ్ఞానం పొందాలి, వచ్చిన జ్ఞానాన్ని మరింతగా పెంచుకోవాలి,

చివరకు ఆ జ్ఞానం ద్వారా మోక్షాన్ని పొందాలి" అనే లక్ష్యాన్ని చాలామంది గుర్తించరు. మీరు గుర్తుపెట్టుకోవలసింది ఏమిటంటే? ధ్యానం శుద్ధత్వానికి, జ్ఞానం మోక్షానికి. మోక్షాన్ని పొందాలంటే జ్ఞానం తప్పనిసరిగా ఉండాలి, జ్ఞానం రావాలంటే దాని కోసం మీరు తీవ్రంగా ప్రయత్నించాలి. కేవలం ధ్యానం చేస్తున్నాను అనే సంతృప్తితో ఆగిపోకుండా, ధ్యానం ద్వారా పొందుతున్న అనుభవాన్ని జ్ఞానంగా మార్చుకుని, ఆ జ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ ముందుకు సాగాలి. ఈ విషయంలో మీరు తీవ్రమైన ప్రయత్నం చేయకపోవడానికి ప్రధాన కారణం కూడా సోమరితనమే.

ఒక పుస్తకం చదవడానికి బద్ధకం, ఎక్కడికైనా వెళ్ళి జ్ఞానం వినడానికి బద్ధకం. మరి ఈ రకమైన బద్ధకం ఉంటే మీరు ఎలా ఎదుగుతారు? ఎక్కడైనా ఒక క్లాస్ జరుగుతుందంటే, "ఇందులో నాకు అవసరమైన విషయాలు ఏమైనా తెలుస్తాయేమో, నేను నేర్చుకోవాల్సిన విషయాలు ఏమైనా ఉన్నాయేమో" అని ఆలోచించి, ఆసక్తితో ఆ క్లాస్‌కు హాజరు కావాలి. అందుకే సజ్జన సాంగత్యంలో పాల్గొంటే మీకు కొన్ని కొత్త విషయాలైనా తెలుసుకునే అవకాశం ఉంటుంది. కానీ "ఏం చెప్తారులే? ఎలా చెప్పినా తిప్పి తిప్పి మళ్ళీ"శ్వాస మీద ధ్యాస" గురించే చెప్తారు" అని ముందుగానే అనుకుంటే మీరు ఏమీ నేర్చుకోలేరు. ఈ రోజుల్లో ధ్యానం గురించి ఎంతో మందికి తెలుసు తెలుసుకున్నప్పటికీ, జ్ఞానంలో అత్యున్నత స్థాయికి వెళ్ళ లేకపోవడానికి ప్రధాన కారణం వాళ్ళకి ఉన్న సోమరితనమే. సోమరితనం వల్ల విచారణ ఉండదు, తెలుసుకోవాలనే ఆసక్తి తగ్గిపోతుంది, సజ్జన సాంగత్యంలో పాల్గొనరు, చివరకు సరైన జ్ఞానం ఏమిటో కూడా తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

"శ్వాస మీద ధ్యాస" అనే విషయం అందరికీ తెలిసినదే కావచ్చు. కానీ ఆ శ్వాస మీకు ఎంతగా ఉపయోగపడుతుంది? దాని ద్వారా మీలో

ఎలాంటి మార్పులు తీసుకురావాలి? మీ ఆలోచనలు, మీ అలవాట్లు, మీ జీవన విధానం ఎలా మారాలి? అనే విషయాలను మీరు ప్రతి క్షణం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో ఒకసారి తెలుసుకున్న దానితో ఆగిపోకుండా, ప్రతి రోజూ ఇంకా ఏదైనా కొత్తది తెలుసుకోవాలి, ఇంకా ఏదైనా నేర్చుకోవాలి అనే తపన మీలో ఉండాలి. అందుకు ఓపిక, శ్రద్ధ రెండూ అవసరం.

కొంత మందికి కొన్ని పనులు చేయడం అంటే బద్ధకం. ఆ బద్ధకం వల్ల చేయగలిగిన పనులను కూడా చేయకుండా వదిలేస్తారు. చదువు వచ్చిన ప్రతి ఒక్కరికీ చదవడం వచ్చు కదా! మరి పుస్తకాలు చదవడం వచ్చి కూడా వాటిని పూర్తిగా చదివి, అర్థం చేసుకుని, జీవితంలో ఆచరించే వాళ్ళు ఎంతమంది ఉన్నారు? ఇక్కడ కొంతమంది ఈరోజు ఎనిమిది పుస్తకాలు పట్టుకెళ్ళారు. కానీ వచ్చే నెలకు అవన్నీ పూర్తవుతాయా? ఎందుకు పూర్తవ్వడం లేదు? కారణం ఏమిటి? సోమరితనం. కాబట్టి మీరు ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, ఈ సోమరితనాన్ని వదిలి, తెలుసుకోవాలనే తపనతో, నేర్చుకోవాలనే ఆసక్తితో, ఓపికతో, శ్రద్ధతో నిరంతరం ముందుకు సాగాలి.

ఏ పని అయినా మీరు చదవడం మానేస్తారు. కనీసం రోజుకి ఒక గంట చదవడానికి సమయం కేటాయిస్తే, కచ్చితంగా పుస్తకాన్ని పూర్తి చేయవచ్చు. మనిషి అనుకుంటే సాధించ లేనిది ఏదీ లేదు. పెద్ద పెద్ద పుస్తకాలు కూడా కాదు, అవి చాలా చిన్నవే. అర్థం కాని గ్రాంథిక భాష కూడా కాదు, చాలా సింపుల్ భాషలో, సులభంగా మీకు విషయాలను చెప్తున్నారు.

మరి ఎందుకు చదవడం లేదు? మీలో ఇంకా సోమరితనం ఉంది. దాని వల్లే చదవడం మీద శ్రద్ధ పెట్టడం లేదు. శ్రద్ధ పెట్టి ఉంటే ఎందుకు పూర్తి కాదు? “ఆ విషయాలు విన్నాం కదా, జూమ్‌లో విన్నాం, క్లాసులో

విన్నాం, ఇంకేం వింటాం?" అని అనుకుంటారు, వింటున్నారు. కానీ ఎన్ని విషయాలు మీకు గుర్తుంటున్నాయి?

మీరు చదివిన ప్రతి సారి, అది మీరు మననం చేస్తున్నారని గుర్తుంచుకోండి. మీరు మననం చేసుకుంటారు. ఎన్నిసార్లు చదివినా, ఆధ్యాత్మిక పుస్తకం యొక్క గొప్పతనం ఏమిటంటే, ఎన్నిసార్లు చదివినా మనల్ని ఇంకా లోతుల్లోకి, మరింత లోతుల్లోకి తీసుకెళ్తుంది. "ఈ లైన్ చదివేశాం" అనుకుంటాం. కానీ ఒక్కొక్కసారి అదే లైన్‌లోనే మనకు ఒక గొప్ప కొటేషన్ దొరుకుతుంది.

అందుకని ఇవి చదివేసి తూకానికి అమ్మే పుస్తకాలు కావు. క్లాస్ పుస్తకాలు అయితే తూకానికి అమ్మవచ్చు. ఎందుకంటే LKG అయిపోయిన వెంటనే UKGలోకి వచ్చేశాం అనుకోండి, LKG పుస్తకం ఇక పనికి రాదు. కానీ ఆధ్యాత్మిక పుస్తకాలు అలా కావు, ముందు నెల పుస్తకం, తర్వాత పుస్తకం, ఆ తర్వాత పుస్తకం ఏ పుస్తకమైనా జీవితాంతం మీతో ఉండాలి. భగవద్గీతను తూకానికి వేయలేం కదా? ఇవి కూడా అంతే, వదిలేయకుండా, ఇంతకుముందు చదివిన పుస్తకాన్నే మళ్ళీ మళ్ళీ చదవాలి. అలా చదివితే మీ బ్రెయిన్ ఎంత షార్ప్‌గా మారుతుందో మీరే గమనించుకోండి.

కొంతమంది వింటారు, అన్నీ తెలిసినట్టుగా ఉంటారు. కానీ మాట్లాడమని మైక్ ఇస్తే భయం అంటారు. చాలామందికి ఈ భయం ఉంటుంది. కానీ ఖాళీగా కూర్చుంటే ప్రక్కన ఉన్న వారితో ఎన్ని కబుర్లు చెప్తారో చెప్పలేం, అప్పుడు భయం ఉండదు. కానీ మైక్ పట్టుకుంటే భయం వస్తుంది. ఎందుకు భయం వస్తుంది? కొందరికి భయం ఉండదు, కొందరికి భయం వస్తుందంటే ఇంకా మీలో లోపం ఉన్నట్టే కదా? మీరు ఎక్కడ ఏది చేసినా, మీలో ఇంకా కొన్ని లోపాలు ఉన్నాయి. "ఈ లోపం పోయే వరకు

నేను తీవ్రంగా కృషి చేయాలి” అని మీకు మీరు అనుకోవాలంటే హార్డ్ వర్క్ చేయాలి. స్కూల్లో మాస్టారు హోంవర్క్ ఎక్కువ ఇస్తే పిల్లలు ఏం చేస్తారు? హార్డ్ వర్క్ చేస్తారు. మీకు ఎవ్వరూ హోంవర్క్ ఇవ్వరు. మీకు మీరే హోంవర్క్ ఇచ్చుకోవాలి, అప్పుడు మీరు హార్డ్ వర్క్ చేస్తారు.

డబ్బు సంపాదించడానికి ఇంటాయన చాలా కష్టపడతాడు. నిరంతరం “ఇంకా ఎలా సంపాదించాలి?” అని ఆలోచిస్తూనే ఉంటాడు. ఇంటావిడ కూడా రేపటి పని కోసం ఇవాళే ప్లాన్ చేస్తుంది, ఉదయం, మధ్యాహ్నం ఏ వంట చేయాలి?  అని ఆలోచిస్తూ ఉంటుంది. అక్కడ హార్డ్ వర్క్ ఉంది. కానీ ఆధ్యాత్మికతలో మాత్రం హార్డ్ వర్క్ ఉండదు. ఇవాళ జూమ్‌లో పాల్గొన్నాం, రెండు గంటలు ధ్యానం చేశాం, ఒక గంట క్లాస్ విన్నాం, రెండు గంటలు డిస్కషన్‌లో విన్నాం అయిపోయింది, చివర్లో “డిస్కషన్‌లో సబ్జెక్ట్ ఏం చెప్పారు సార్?” అంటే, ఇదే వస్తుంది “ఫస్ట్ ఎవరిని సార్ తిట్టారు? ఏం జరిగింది?” ఇవి మాత్రం బ్రహ్మాండంగా గుర్తుంటాయి. అంటే ప్రాపంచిక విషయాలలో మీకు అసలు బద్ధకం ఉండదు, సోమరితనం ఉండదు. కానీ ఆధ్యాత్మిక విషయాల మీద ఆసక్తిని తగ్గిస్తారు. ఆ ఆసక్తిని ఆధ్యాత్మికత మీద పెంచుకుంటే, మీలో ఇసుమంత కూడా సోమరితనం ఉండదు. సోమరితనమే మీరు ఎదగక పోవడానికి కారణం. సాధన చేయకపోవడానికి అదే కారణం. స్వాధ్యాయం చేయకపోవడానికి కూడా అదే కారణం.

ఎక్కడికైనా వెళ్ళి విందాం అంటే, “అనవసరం, ఏం వింటాం? ఈ ధ్యానం వాళ్ళు ఎప్పుడూ అదే కదా గైడింగ్ వాళ్ళు గైడింగ్ అంటారు, మ్యూజిక్ వాళ్ళు మ్యూజిక్ అంటారు,. సైలెన్స్ వాళ్ళు సైలెన్స్ అంటారు” అని అనుకుంటారు. రాఘవరావు గారి శిష్యుల దగ్గరికి వెళ్తే, “సైలెన్స్, భీమవరం రండి” అని అంటారు. ఈ రెండే కదా చెప్తారు అని అనుకుంటారు. మీరు

రమ్మని ఒక్కసారి అనగానే, మీ ఎదుగుదల చూసి వాళ్ళే పరిగెత్తుకుని వస్తారు. మొన్నటి వరకు నోట్లో నుంచి మాట రాని వాళ్ళు, ఇవాళ ఇంత అనర్గళంగా ఎలా మాట్లాడుతున్నారు? వాళ్ళు అక్కడికి వెళ్ళి ధ్యానం చేశారు, గంటలు గంటలు సాధన చేశారు. మీరు ఇక్కడికి వచ్చి ధ్యానం మీద దృష్టి, చెప్పుతున్న విషయాల మీద దృష్టి ఈ రెండింటి మీద దృష్టి పెడితే భీమవరం మహత్యం తెలుస్తుంది.

డిసిప్లిన్ కూడా ఎక్కువగా వస్తుంది. "తిడతారు, తిడతారు" అని అనుకుంటూ వస్తే, ఇక్కడ చెప్పిన జ్ఞానంలో ఎంత మంచి ఉన్నా అది మీకు ఎక్కదు. ఎవరి మాటలైనా సరే, మీరు విని, విచారణ చేసి, ఆ తర్వాత ఒక నిర్ణయం తీసుకోవాలి. "తిడతారు" అని ఎవరో అంటే అదే పట్టుకుని నిరంతరం మాట్లాడకూడదు. ఎందుకు తిడతారు? మీరు డిసిప్లిన్‌గా ఉండడం కోసం ఆ క్రమశిక్షణ లేకపోతే సాధనలో ముందుకు వెళ్ళడం కష్టం.

ఉదయం నాలుగింటికి మీరు లేచి రావడం అంటే, మీలో ఉన్న తమోగుణ లక్షణాలు మొదట పోవాలి. గురువులు బ్రహ్మ ముహూర్తంలో సాధన చేయమని ఎందుకు చెప్తారు? ఆ బ్రహ్మ ముహూర్తంలో మీరు లేవగలిగితే, మొదట మీలో పోయేది తమోగుణం, అంటే సోమరితనమే. ఎందుకంటే పడుకున్నప్పుడు ఆ సమయంలో చాలా బాగా నిద్ర వస్తుంది. కానీ మీరు సాధన మీద దృష్టి పెట్టి పడుకుంటే "మూడు ఎప్పుడు అవుతుంది? ఎప్పుడు లేవాలి?" అనే ఆలోచనతో పడుకుంటారు.

మీ బ్రెయిన్‌కు ఒక హోంవర్క్ ఉంటే, అది దాని గురించి ఆలోచిస్తూ ఉంటుంది. చేసే పని మీద దృష్టి ఉంటే, బ్రెయిన్ నిరంతరం వర్క్ చేస్తూనే ఉంటుంది. "రేపు ఎలా అవుతుంది? రేపు ఎలా అవుతుంది?" అని ఆలోచిస్తూ ఉంటుంది. మీ బ్రెయిన్‌కు హోంవర్క్ ఇవ్వకపోతే అప్పుడు అది హాయిగా

నిద్రపోతుంది, నిశ్చింతగా ఉంటుంది. అందుకే సమస్యలు ఉన్నవాడు నిద్రపోడు. ఏ సమస్య లేనివాడు నిశ్చింతగా నిద్రపోతాడు. రేపు ఏదైనా పని ఉందనుకోండి, మీకు ఇవాళ నిద్ర రాదు. ఎందుకంటే మీ బ్రెయిన్ ఆ పని మీదకు వెళ్ళిపోతుంది. ఏ పని లేదనుకోండి, చాలా నిశ్చింతగా నిద్రపోతారు.

మీ బ్రెయిన్ విశ్రాంతి తీసుకునే సమయం ఏది అంటే ధ్యానమే. అందుకే ఎప్పుడైనా ఎవరికైనా సమస్య ఉంటే, మనం చెప్పే మొదట చెప్పే సూత్రం "కాస్త ధ్యానం చేయండి, బాగుంటుంది" అని. ఎందుకంటే ఆ సమయంలోనే మీ బ్రెయిన్ విశ్రాంతి తీసుకుంటుంది. మామూలు మానవులకు నిద్రలో విశ్రాంతి లభిస్తుంది. కానీ సాధకులకు రెండు లాభాలు ఉంటాయి. ఒకటి విశ్రాంతి, రెండోది శక్తి. మీరు ఎంతగా సాధన చేస్తారో, మీలో ప్రతి అణువు అంతగా శక్తివంతమవుతుంది. మంచి శక్తి పొందినప్పుడు మీ దగ్గరకు అసలు సోమరితనమే రాదు.

అందుకే పత్రి గారు అనేవారు "రేపటి పని ఈరోజు చేయి, ఈరోజు పని ఇప్పుడే చేయాలి" అని. ఎందుకంటే సాధకులు అంత యాక్టివ్‌గా ఉండాలి. సాధన లేని వాళ్ళు ప్రతి పనిని వాయిదా వేస్తారు. కానీ సాధన ఉన్న వాళ్ళు "రేపు కాదు, ఇప్పుడే, ఈ క్షణమే ఆ పని పూర్తి చేసుకోవాలి" అని అనుకుంటారు. ముఖ్యంగా సాధకుడికి శత్రువు సోమరితనం. దాన్ని వదిలించుకుంటే మీరు చాలా చాలా పనులు చేయగలుగుతారు. అందుకే "సోమరితనం ఉన్న వాడు ఏదీ సాధించలేడు" అని చెప్తారు. బద్దకము, నిద్దుర వద్దు సుమీ, తోటి వారలు మొద్దు అని అంటారు. బద్ధకం వల్ల ఎప్పుడు పడితే అప్పుడు నిద్రపోకూడదు. బద్ధకం ఉంటే ఏమవుతుంది? వచ్చేది సోమరితనమే.

మీకు బాగా బద్ధకంగా ఉంటే "ఆ తర్వాత చేద్దాంలే, ఇప్పుడు ఏం తొందర?" అంటారు. బద్ధకం లేకపోతే "చేద్దాం" అంటారు. అందుకే సాధకుడికి

ముఖ్య శత్రువు సోమరితనం. ఎప్పుడైనా మీ సాధన కానీ, స్వాధ్యాయం కానీ, సజ్జన సాంగత్యం కానీ వాటికి సోమరితనం అస్సలు ఉండకూడదు. ఉంటే సాధించవలసింది ఏదీ మీరు సాధించ లేరు. ఈరోజు ఒక్క అడుగు వేయాలి కదా అని ఆ అడుగు వేయడం మానేస్తే, రేపు మీ టైమ్ టేబుల్‌లో రేపటిదీ, ఈ రోజుదీ కలిపేయాల్సి వస్తుంది, అప్పుడు మీకు భారం అవుతుంది.

ఈరోజు పని ఈ రోజే చేసుకుంటే, రేపటి పని రేపు చేసుకోవచ్చు. కానీ మీరు బద్ధకంతో, సోమరితనంతో చేయకపోతే రేపటి పని భారం అవుతుంది. అందుకే సోమరితనం మీలో ఎప్పుడూ ఉండకూడదు. జ్ఞానులు "నాకింకా సోమరితనం ఉందా? నాకింకా బద్ధకం ఉందా? ఇది కూడా ఒక దుర్గుణమే" అని మీకు మీరు ప్రశ్నించుకుంటారు. దాన్ని పోగొట్టుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటారు. మరి సోమరితనం ఎందుకు వస్తుంది అని ఆలోచించినప్పుడు, "నేను ఎటువంటి ఆహారం తింటున్నాను?" అని కూడా మీరు ఆలోచించాలి. ఆహారాన్ని బట్టి కూడా మీలోని గుణాలు ప్రభావితం అవుతాయి. తమోగుణ ప్రధానమైన ఆహారం తీసుకుంటే, మీరు అన్నిటికీ బద్ధకిస్తారు.

చాలామంది ఫ్రిజ్‌లో పెట్టి పాడై పోతుందని దాచుకుని, దాచుకుని తింటారు. అదే అసలు కారణం. మీ శరీరంలో తమోగుణం రావడానికి కారణం కూడా ఇదే. మీ మనసుకు తమోగుణం వచ్చింది అంటే, అది ఎప్పుడైతే మీరు ఏదీ సాధించలేరు, గ్రహించే శక్తి ఉండదు. సోమరులకు, బద్ధకస్తులకు గ్రహణ శక్తి తగ్గిపోతుంది. ఎందుకంటే వాళ్ళ బ్రెయిన్ షార్ప్‌గా ఉండదు. అందుకే ఏదీ సరిగ్గా గ్రహించలేరు.

కొంతమంది మేధావులు చెప్పకుండానే గ్రహించగలరు. ప్రాపంచిక జీవితంలో గమనిస్తే, బాగా మంచి మార్కులు వచ్చిన వాడి బుద్ధి షార్ప్‌గా ఉందని అంటారు. షార్ప్‌గా ఉన్నవాడికే ఫస్ట్ మార్కులు వస్తూ ఉంటాయి.

అంటే మాస్టర్ చెప్పిన పాఠాల మీద దృష్టి పెట్టి, దాన్ని గ్రహించగలుగుతున్నాడు. మరి అదే సోమరిగా ఉంటే? ఫస్ట్ బెంచీలో కూర్చున్నా బుర్ర ఎక్కడెక్కడికో వెళ్ళిపోతుంది వినడు.

జనరల్‌గా చిన్నప్పటి నుంచి కొన్ని పనులను తల్లిదండ్రులు మీ కోసం ఎక్కువగా చేస్తారు. చిన్నప్పుడు ముద్దుగానో, గారాబంగానో మీరు వాళ్ళ మీద డిపెండ్ అయిపోతారు. "అమ్మ చేస్తుందిలే, నాన్న చేస్తాడులే" అని. అలా డిపెండెన్సీ పెరిగితే కొంత సోమరితనం కూడా వస్తుంది. మీ పని మీరే చేసుకుంటే, అప్పుడు అవన్నీ వదులుతాయి. అందుకే హాస్టల్లో పెరిగిన విద్యార్థులకు, తల్లిదండ్రుల దగ్గర పెరిగిన విద్యార్థులకు బిహేవియర్‌లో చాలా తేడా ఉంటుంది. తల్లిదండ్రుల దగ్గర ఉన్న వాళ్ళు అతి గారాబంతో ఉంటారు. అదే హాస్టల్లో ఉంటే ఎలా రెస్పెక్ట్ ఇవ్వాలో నేర్చుకుని, క్రమశిక్షణగా ఉంటారు. ఎందుకంటే హాస్టల్లో ఉండి వాళ్ళ పని వాళ్లే చేసుకోవడం అలవాటు అవుతుంది, దానికి తోడు ధ్యానం కూడా ఉందనుకోండి, ఇంకా షార్ప్‌గా ఉంటారు.

అందుకే మహాత్ములు ఒక మాట చెప్తారు "అనంతమైన శక్తి మీలో దాగి ఉంది, దాన్ని వెలికి తీసే మార్గమే ధ్యానం. మేము అంత పని చేస్తున్నాము మీరు చేయలేకపోతున్నారు అంటే మీకున్న సోమరితనం, బద్ధకం, నిర్లక్ష్యమే. మీరు చేయగలరు. మాలో ఉంది ఆత్మే మీలో ఉంది ఆత్మే. మేము చక్కగా చేయగలుగుతున్నాం కానీ మీరు చేయలేకపోతున్నారు అంటే మీరు విచారణ చేసుకుంటే, మీలో ఏదైనా లోపం ఉందని తెలిస్తే ఇంకా సాధన ఎక్కువ చేయాలి.

ఒక్క ధైర్యం విషయంలోనే కాదు, గ్రహణ శక్తి, మేధా శక్తి, ధారణ శక్తి ఇన్ని శక్తులు మీలో లోపిస్తున్నాయంటే ఇంకా మీ సాధన సరిపోలేదని అర్థం. ఇప్పుడు పొయ్యి మీద గిన్నె పెట్టి కూర వండినప్పుడు, ఆ కూర

మాడకపోతే ఆ గిన్నెను త్వరగా తోమేయొచ్చు కానీ ఆ గిన్నె మాడితే తోమటానికి ఎక్కువ సమయం పడుతుంది కదా అలానే మీరు మాడిపోయిన గిన్నెలా ఉంటే, మీలోని శక్తులు బయటికి రావు ఇంకా సాధన ఎక్కువ చేయాలి.

ఈ సాధన దేనికి అంటే, ఫస్ట్ వచ్చిన వాడిలో ఏది ఉందో మీలో కూడా అదే ఉంది. వాడికి ఆత్మ ఉంది, బుద్ధి ఉంది, మనసు ఉంది. అన్నీ ఉన్నాయి. మీకు కూడా అన్నీ ఉన్నాయి. కానీ అవి బయటికి రానివ్వడం లేదు, వాడు బయటికి రానిచ్చాడు అంతే తేడా. పరమాత్మ ఏ పదార్థమో, జీవుడు కూడా అదే పదార్థం. అక్కడి నుంచి వచ్చిన ఆత్మే కదా. మరి ఆయన ఇచ్చేవాడిలా ఉన్నాడు, మీరు తీసుకునే వాళ్ళలా ఉన్నారు.

మీరు పరిమిత జ్ఞానంతో ఉన్నారు, ఆయన అపరిమితమైన జ్ఞానంతో ఉన్నాడు. అంటే మీరు మాయకు వశమై, ప్రపంచం శాశ్వతం అనుకుంటూ, తల్లిదండ్రుల వల్ల, చుట్టూ ఉన్న పరిసరాల వల్ల మీరు ఉండవలసిన విధంగా ఉండడం లేదు. ఏ ఆత్మ పదార్థంగా పరమాత్మ నుంచి వచ్చారో, ఆ లక్షణాలు మీలోనే ఉన్నాయి. పరమాత్మ లక్షణాలు మీలోనే ఉన్నాయి. కానీ దాని పైన మనసు అనే ఒక ముసుగు వేసుకుని, ఈ ప్రపంచంలోని చెత్త అంతా పోగేసుకున్నారు. ద్వేషం, స్వార్థం, అసూయ, ఈర్ష్య ఇవన్నీ ప్రపంచాన్ని చూసి పోగేసుకున్నారు. "నేను జీవుణ్ని, పరిమితమైన వాడిని, శక్తిహీనుడిని" అని అనుకుంటున్నారు. అపరిమితమైన పరమాత్మ నుంచే వచ్చారు. కానీ పరిమిత మైన శక్తి ఉన్న వాడిని అనుకుంటున్నారు, "నా వల్ల ఏదీ కాదు" అని అనుకుంటున్నారు. ఎందుకు ఈ ఆలోచన వచ్చింది? మీ మనసు పుట్టిన దగ్గర నుంచి ఈ ప్రపంచాన్ని చూస్తుంది, చూసి, అలాగే అలవాటు చేసుకుంది.

ఈ అలవాటు పోవడానికి సమయం పడుతుంది. ఈ జన్మలోనే పూర్తవుతుందా, లేక పై జన్మకు కూడా కొనసాగుతుందా అనేది చెప్పలేరు.

ఎంతగా అజ్ఞానంలో కూరుకుపోయారో, ఆ అజ్ఞానాన్ని వదులుకోవడానికి అంతే సాధన చేయాలి. మీరు ఒక విషయాన్ని విన్న వెంటనే అర్థం చేసుకోగలిగితే, మీరు జ్ఞాన పరంగా ఎదుగుతున్నట్టే.

గురువు ఒక విషయం చెప్పారనుకోండి, మీకు అది అర్థమై, ఆచరణలో పెట్టుకుంటున్నారంటే మీరు జ్ఞాన వంతులే. ఇప్పుడు పత్రి గారు అందరినీ “మాంసం తినొద్దు, వెల్లుల్లి తినొద్దు” అని నేర్పారు. చాలామంది శిష్యులు దాన్ని పాటిస్తున్నారు. మరికొంతమంది మాత్రం “మాంసం తిన్నా తప్పు లేదు'' అని ఇప్పుడు క్లాసులు కూడా చెప్తున్నారు, ‘‘మెల్లిగా మానుకుంటాడులే” అని అనుకుంటున్నారు. వెల్లుల్లి విషయంలో కూడా అదే పరిస్థితి.

ఎందుకు ఆచరణలో పెట్టుకోలేక పోతున్నారు అంటే, ఈ ప్రాపంచిక వ్యవహారంలో మునిగిపోయి, నిగ్రహం అనే శక్తి లేక ఏదీ గ్రహించలేరు. నిగ్రహం ఉంటేనే గ్రహణ శక్తి ఉంటుంది, ఆ నిగ్రహం లేనివాడు ఏం చేస్తాడు? దానివల్ల దోషాలు ఉన్నాయని గురువులు మీకు చెప్పారు. మరి మీరు ఆచరించట్లేదు అంటే, మీలో ఉన్న సోమరితనమే మిమ్మల్ని ఆచరించనివ్వకుండా చేస్తుంది. “సోమరితనం” అనేది చాలా చిన్న పదం. కానీ మీ జీవితంలో దాన్ని పోగొట్టుకోకపోతే చాలా ఎక్కువ నష్టం జరుగుతుంది. “ఈ ఒక్క దాని వల్ల ఏమి జరిగిపోతుంది?” అనుకుంటారు. కానీ అది మీ జీవితంపై ఎంత ప్రభావం చూపుతుందో మీరు గమనించాలి

మీరు కూడా ఈ సోమరితనమే జన్మలు పెరగడానికి కారణం అని అనుకుంటే, తెల్లవారుజామున నిద్రపోరు. మీరు పడుకున్నప్పుడు ఆ మాట గుర్తుండి, రేపు లేవుదాంలే అనిపించినప్పుడు, రేపటి లోగా నాకు జన్మ పెరుగుతుందేమో అని అనిపిస్తే టక్కున లేచి కూర్చుంటారు. లేకపోతే,

“ఏమైంది? రేపు చేయొచ్చులే, రోజూ ఉన్న ధ్యానమే కదా” అని అనుకుని పడుకుంటారు. మీ మనసు ప్యూరిటీగా ఉంటే ఏం గుర్తొస్తుంది? ఒకరోజు ధ్యానం మానేస్తే ఒక జన్మ పెరిగిపోతుందేమో అనిపిస్తుంది, ప్యూరిటీగా ఉంటే అలా అనిపిస్తుంది.

ఒక్కరోజు చేయకపోతే ఏమవుతుందో ఆలోచించండి “మళ్ళీ పునరపి మరణం, పునరపి జననం”. సోమరితనం బయటికి మామూలు బద్ధకంలా అనిపిస్తుంది. కానీ ఆధ్యాత్మికంలో దాని వల్ల ఎంత నష్టం ఉంటుందో అర్థం చేసుకోవాలి. అందుకే గురువులు మీకు సోమరితనం వద్దు అని నేర్పిస్తారు. గురువులు తమ జీవిత అనుభవంతో ఎందుకు దగ్గరగా ఉంటారు అంటే, వాళ్ళు ఎలా నడిచారో, వాళ్ళ నడక ఎలా ఉందో, వాళ్ళ మాట ఎలా ఉందో, వాళ్ళ వ్యవహారం ఎలా ఉందో మీరు చూసి నేర్చుకుంటారు. అందుకే పూర్వం రోజుల్లో శిష్యులు గురువుల సేవలో పూర్తిగా దగ్గరగా ఉండేవారు. గురువులా ఎదగాలనుకుంటే గురువు ప్రవర్తనను గమనించేవారు. అందుకే గురు శుశ్రూష చేస్తే సాధు ధర్మం బోధపడుతుంది.

సాధువు ఎవరు అంటే సత్యాన్వేషణ చేసిన వాడే సాధువు. సత్యం కోసం అన్వేషణ చేసేవాడు సాధువు. నిరంతర శ్రమజీవి ఎవరు అంటే గురువే, శిష్యుడు కాదు, గురువే నిరంతర శ్రమజీవి. ఎందుకు అంటే, గురువు తన గురించి తాను ఆలోచించడు. శిష్యుడిని ఎలా దారిలో పెట్టాలి అని నిరంతరం ఆలోచిస్తాడు. తల్లిదండ్రులు కూడా బిడ్డల కోసం అంతకాలం ఆలోచించరు. ఒక వయసు వచ్చే వరకు, వాడు చదువు పూర్తిచేసి ఉద్యోగమో, వ్యాపారమో చేసుకునే వరకు తండ్రి ఆలోచిస్తాడు. వాడు స్థిరపడిన తర్వాత అంతగా ఆలోచించడు. కానీ గురువు చనిపోయే వరకు కూడా శిష్యుల గురించి ఆలోచిస్తూ, అనుక్షణం నడిపిస్తూనే ఉంటాడు.

గురువు పాత్ర చాలా కష్టమైనది. నేను పత్రి గారిని చూసే దాన్ని కదా! చివరి వరకు ఆయన ఆలోచన మన కోసమే. అందుకే "నేను ప్రచారం చేస్తాను సార్" అంటే చాలా ఆనంద పడిపోయారు. "నిజమేనా? చేస్తావా? నువ్వు నాలా చేస్తావా? చేస్తావా? చేస్తావా?" అని అడిగారు.

గురువులు శిష్యుల నుంచి ఆశించేది అదే. తాను ఏ పని చేస్తున్నాడో, అదే పనిని శిష్యులు చేసినప్పుడు గురువు చాలా ఆనందపడతాడు. శిష్యుల నుంచి డబ్బులు ఆశించే గురువులు గురువులు కాదండి. తాను ఏ విధంగా లోకానికి జ్ఞానం పంచాడో, అలాగే శిష్యులు పంచినప్పుడు, "నాకు తగ్గ శిష్యులు వీళ్ళు" అని గురువు చాలా సంతోషిస్తాడు.

అది నేను పత్రి గారి కళ్ళల్లో చూసి గ్రహించాను. చివరి సమయంలో ఆయన చాలా ఆనంద పడిపోయారు. "సార్, మీలా నేను చివరి వరకు పోరాడతాను సార్, చెప్తాను సార్" అంటే, "నిజంగా చెప్తావా? నిజంగా చెప్తావా?" అని అడిగారు. మైక్‌లో చెప్పి, ఈ మాట అందరూ వినాలి అని కమిట్‌మెంట్ చేయించారు.

మీరు ఇందులో పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఏమీ లేదు. ముందుగా శరీరం మీద జాలి వదలాలి. "నేను ఇప్పుడు వెళ్ళి వచ్చాను, అప్పుడు వెళ్ళి వచ్చాను" అని శరీరం మీద జాలి పడకుండా, మీరు కొంచెం కష్టపడాలి. ఇక్కడ ఉన్న వాళ్ళు ఎంత సుఖపడుతున్నారో, ఎంత దుఃఖం నుంచి దూరం అవుతున్నారో మీకు అర్థం కాదు. కానీ పరమాత్మ యొక్క ఆకాంక్ష భూమిమీద ఉన్న ప్రతి ఒక్కరూ జ్ఞాన వంతులు కావాలి అనేదే.

ఆయన మీకు మానవ రూపం ఇచ్చి భూమి మీదకు పంపిస్తే, మీరు దాన్ని మర్చిపోయి ప్రతి విషయంలోనూ దుఃఖపడుతున్నప్పుడు, సద్గురువుని పంపిస్తాడు. మీరు దాన్ని గ్రహించి ఈ జ్ఞానాన్ని పొందినప్పుడు,

గురువు ఏ మార్గంలో వెళ్ళారో అదే మార్గంలో మీరు నడిచినప్పుడు పరమాత్మ, గురువు ఇద్దరూ సంతోషిస్తారు.

"నేను గురువుని పంపినప్పుడు వీడు సన్మార్గంలోకి వచ్చాడు. జ్ఞానవంతుడు అవుతున్నాడు. వీడు జ్ఞానవంతుడు అవ్వడమే కాదు, పది మందిని జ్ఞాన వంతులు చేస్తున్నాడు" అని పరమాత్మ సంతోషిస్తాడు. మీరు చేయాలి అంటే మీకున్న బద్ధకం, మీకున్న సోమరితనం ఈ అవలక్షణాలన్నీ వదలాలి. "జీవుడిగా బ్రతకకూడదు, దేవుడిగా ఎదగాలి" అనే కోరిక మీకు ఉంటే ఈ రెండింటినీ వదిలేస్తారు. ఏంటి? సోమరితనం, బద్ధకం. ఈ రెండూ వదులుతారు. పంచభూతాలు కానీ, సూర్యచంద్రులు కానీ, నదులు, పర్వతాలు, నక్షత్రాలు కానీ సోమరిగా ఒక్క పూట, ఒక రోజు రెస్ట్ తీసుకుంటే సృష్టి ఏమవుతుంది? గాలి ఒకరోజు రెస్ట్ తీసుకుంటే? సూర్యుడు ఒకరోజు రెస్ట్ తీసుకుంటే? ఏమవుతుంది ఈ జీవుల బతుకు?

సూర్యుడు తన కిరణాలన్నీ ఒక్కసారి వెనక్కి తీసేసుకుని, "ఒక వారం రోజులు హాయిగా రెస్ట్ తీసుకుంటాను" అంటే మీ పరిస్థితి ఏమవుతుంది? సృష్టి అంతా అంధకారంలో ఉంటుంది. నదులు ప్రవహించకుండా ఆగిపోతే, గాలి ఆగిపోతే ఏమవుతుంది? అందుకే ఏవీ ఆగవు, గ్రహాలు ఆగవు, పంచభూతాలు ఆగవు, సూర్యచంద్రులు ఆగరు, కానీ మానవుడికి అనుభవిస్తే ఆగిపోదాం అనిపిస్తుంది. ఏ పని చేయని మానవుడికి రెస్ట్ కావాలి. అన్ని పనులు చేస్తున్న ఈ పంచభూతాలు, ఈ సృష్టి తమ పని తాము చేస్తూనే ఉన్నాయి. అందుకని వాటన్నిటినీ చూసినప్పుడు, వీటన్నిటినీ కూడా శాసించగలిగే శక్తి, పొందగలిగే శక్తి మీలో ఉంది. మీరు గ్రహాలను ఆపగలిగేంత, అన్నిటినీ ఆపగలిగేంత శక్తిని పొందగల సామర్థ్యం కూడా మీలో ఉంది.

కానీ మీ బద్ధకం, మీ నిర్లక్ష్యం, మీ సోమరితనమే మిమ్మల్ని అంతగా

ఎదగనివ్వకుండా చేస్తున్నాయి. దాన్ని కొంచెం వదలగలిగితే మీరు ఎంతైనా సాధించగలుగుతారు. మీకు తెలియనంత కాలం తపన ఉండదు. ఈ ధ్యాన మార్గంలోకి వచ్చే వరకు మీకు ఏం తెలియదు. ఇది ఎంత గొప్పదో తెలియదు. ఏదో ఎగిరి ఎగిరి వచ్చి ఆధ్యాత్మికంలో పడినట్టుగా వచ్చారు. ఇది ప్రారంభించినప్పుడు కూడా ఇంత గొప్పదని తెలియదు. నాకైతే ఏం తెలియదు, ఏదో నా రోగం తగ్గడానికి స్టార్ట్ చేశాను. "భగవంతుడికి జ్ఞానులే ఇష్టులట" అన్న మాట నాకు నచ్చి "నేను జ్ఞానంలో స్థితమయ్యాను. నాకు దేవుడు ఇష్టం కాదు, దేవుడికి జ్ఞానులు ఇష్టులట" అని అనుకున్నాను. తర్వాత ఈ మాటలన్నీ బాగానే ఉన్నాయి. ఆచరణలో పెట్టుకుంటూ వెళ్తే, ఏదో ఊబిలో కూరుకు పోయినట్టు, ఎంత లోతుకెళ్ళానో కూడా తెలియని పరిస్థితి. ఎన్ని మార్గాలు నేర్చుకున్నా, ఏది ఉండకూడదు, ఏది ఉండాలి, ఎందుకు ఇలా జరుగుతుంది ఇవన్నీ అధ్యయనం చేసిన కొద్దీ ఇంకా నేర్చుకోవాల్సింది ఉందని తెలుస్తుంది.

ఎన్ని నేర్చుకున్నా అంతం లేదు. ప్రపంచ చదువుకి అంతం ఉంటుంది. కానీ ఈ చదువుకి అంతం లేదు. జుట్టు నెరసిపోయినా ఈ స్కూల్లో ఉండొచ్చు. అంత నేర్చుకోవాల్సింది ఉంది. దీన్ని సోమరి తనం అని నేను ఒక పుస్తకంలో చదివాను. "సోమరితనం ఏముందబ్బా? ఒకవేళ బద్ధకంగా మానేస్తే రేపు చేసుకుంటారు కదా" అనుకున్నాను. ఆ పుస్తకం చదివితే, "ఓయమ్మో! ఏదో తుకారాం విమానం లాగ ఉందది" అనిపించింది. చూడండి, వాళ్ళ భార్య వెళ్ళడం మానేసింది, ఇది కూడా అంతే. అందుకే జ్ఞాన మార్గంలో ఉన్నవారికి ప్రథమ శత్రువు సోమరితనమే.

కానీ దీన్ని దాటడానికి శరీరానికి, మనసుకు ఒక పది రోజులు కష్టమైనా మీరు అలవాటు చేసుకుంటే, తర్వాత అది అలవాటై పోతుంది. చిన్నప్పుడు పుట్టిన వెంటనే కొన్నాళ్ళు పాలు తాగుతాం. ఆ తర్వాత అమ్మ

అన్నం పెడుతూ ఉంటుంది. అప్పుడు మీరు అన్నం బయటకు తోస్తూ ఉంటారు, అమ్మ లోపలికి తోస్తూ ఉంటుంది, మీరు ఊస్తూ ఉంటారు, అమ్మతోస్తూ ఉంటుంది, ఇలా చేస్తూ చేస్తూ ఇప్పుడు కంచంలో అన్నం తినే స్టేజ్‌కి వచ్చారు. ఎందుకు?

అందుకే శ్రీ కృష్ణుడు ఏమన్నాడు? అభ్యాసం చేస్తే సాధన కూడా సాగిపోతుంది. మొదట్లో కష్టం అనిపిస్తుంది. కానీ అభ్యాసం చేస్తే సాధించ లేనిది ఏమీ లేదు. శ్రీ కృష్ణుడు వైరాగ్యం కూడా చెప్పాడు. ఈ ప్రపంచంలో మీరు ఏమి కోరుకున్నా అన్నీ మీకు రావు. మీరు కూడా ఈ ప్రపంచానికి వచ్చిన వారే కదా? అందుకే ప్రపంచంలో ఉంటూనే మీ అవసరాలు తీర్చుకుంటూ, సాధన వైపు ఎదగాలి. సాధనలోకి రాని వాడికి డబ్బు గోల తప్పించి పెద్దగా గోల ఏమీ ఉండదు. వాడికి ఒకటే గోల "ఎంత కోట్లు సంపాదిస్తాము? ఎంత సంపాదిస్తాము? పిల్లలకి ఎన్ని కొంటాము? ఏం ఇద్దాము?" అని. మీకు మాత్రం వేరే గోల ఉంది, అది ఇదే గోల. ఎందుకంటే ఇది అందరికీ తెలియని బ్రహ్మ విద్య. అందుకే శ్రీ కృష్ణుడు దీన్ని "గుహ్యాతి గుహ్యం" అన్నాడు. అంటే రహస్యాలలోకెల్లా అతి రహస్యమైన విద్య అని చెప్పాడు. అందరూ వింటారు కానీ ఆచరణలో పెట్టుకోలేని విద్య ఇది. అన్ని విద్యలలోకి అత్యంత రహస్యమైన విద్య ఏమిటి అంటే బ్రహ్మ విద్య. ఇది గుహ్యాతి గుహ్యం. ఎవ్వరూ దీని కోసం ప్రయత్నించరు. ప్రయత్నిస్తే దీని విలువ తెలుస్తుంది. కానీ అందరూ ప్రయత్నించ గలుగుతున్నారా? 90%మంది ప్రయత్నించరు. 10%మంది ప్రయత్నిస్తారు. అందులో తొమ్మిది శాతం మంది కష్టాలు వచ్చాయని జారిపోతారు. చివరకు ఏ ఒక్కడో మిగులుతాడు. పిరమిడ్లు కడతారు. అనౌన్స్‌మెంట్లు కూడా చేస్తారు, "పిరమిడ్లు కడితే సత్యలోకంలో చోటు ఉంటుంది" అంటారు.

ఇంట్లో చిన్న కష్టం వస్తే అదే పిరమిడ్‌ను పడగొట్టే వాళ్ళను నేను చూసాను. ఎందుకు ఇలా అవుతుంది? ఆధ్యాత్మిక విద్య మీద సరైన అవగాహన లేక లాభాలు ఆశించి, లాభాలు దొరకకపోతే దీన్ని చెడ్డగా కూడా ప్రచారం చేస్తారు. "ధ్యానంలోకి వెళ్ళాక మా వాడికి పిచ్చెక్కింది. ధ్యానంలోకి వెళ్ళాక అన్నీ వదిలేశాడు, ధ్యానంలోకి వచ్చాక తినట్లేదు, మళ్ళీ వాడు సన్నగా అయ్యాడు" అని అంటారు.

మాంసం మానేసి సన్నగా అయ్యాడని ఒక పుకారు ఉంది. మాంసం మానేసి, మాంసం తినకుండానే జన్మంతా బ్రతికిన వాళ్ళు లేరా? బ్రతుకుతున్నారు కదా! "మేము ఎప్పుడూ తినలేదు, మేము బాగానే ఉన్నాం" అని చెప్పే వాళ్ళు కూడా ఉన్నారు. "మాంసం తింటే బలం వస్తుంది, ఇది వస్తుంది" అనే ఒక భ్రాంతి ఉంటుంది. ధ్యానం చేసే వాళ్ళను చూసి కూడా కొంతమంది బాధపడతారు.

అందుకే ప్రతి తల్లిదండ్రులు కొడుకు అంబానీ అయిపోవాలని అనుకుంటారు, కానీ కొడుకు వివేకానందుడు అవ్వాలని కోరుకోరు. ఎందుకంటే "వాడు ఏదైనా కాషాయం కట్టుకుని పారిపోతాడు" అని భయపడతారు. మీరు ధ్యానం చేస్తే చాలా మంది భయపడుతారు. పిల్లలు ఎక్కువగా ధ్యానం, ధ్యానం అంటే అప్పుడే ధ్యానం అనుకుంటారు. కానీ ఈనాటి పరిస్థితుల్లో సరైన ప్రవర్తన ఉండాలి అంటే ముందు పిల్లలు ధ్యానం చేస్తేనే ఏది మంచి, ఏది చెడు అనేది వాళ్ళకు అర్థమవుతుంది, వాళ్ళు ప్రతి క్షణం హుషారుగా పని చేస్తారు.

ఇప్పుడు హైదరాబాద్ చైతన్యను చూడండి, కాలేజీలోనే చదువుతున్నాడు. ఖాళీ ఉన్నప్పుడల్లా భీమవరం వచ్చి క్లాసెస్ చేస్తున్నాడు. అంటే డబుల్ పని చేస్తున్నాడు. ఇక్కడికి రాకపోతే వాడి పని చదువుకోవడం. కానీ ఇది కూడా చేస్తున్నాడు అంటే వాడికి ఎంత ఎనర్జీ ఉన్నట్టు? ఎంతో ఎనర్జీ

ఉంటేనే రెండు పనులు చేయగలడు! ఈ వయసులో ఆడి పాడి, హాయిగా ఫ్రెండ్స్‌తో తిరగాల్సిన సమయాన్ని కూడా తను దీనికే స్పెండ్ చేస్తున్నాడు. కాబట్టి నేచర్ ఏం చేస్తుంది? వాడికి ఇవ్వాల్సిన గిఫ్ట్ వాడికే వస్తాయి. అలా మీరు కూడా ఈ సాధన మార్గంలోకి రావడం మాత్రమే కాదండి, ఇందులో నిలబడాలి.

జ్ఞానిగా మిమ్మల్ని సృష్టించిన పరమాత్మ మిమ్మల్ని చూసి ఎప్పుడు సంతోషిస్తాడు అంటే, ఈ భూమిమీద ఉండగానే ఆయన వైపు తిరిగి, "పరమాత్మ నాలోనే ఆత్మగా ఉన్నాడు" అని తెలుసుకొని, అన్వేషణలో ఉన్న సాధకుడిగా ఉన్నప్పుడు. మీరు ఎప్పుడైనా సాధించగలరు. సాధించకుండా ఏమీ ఉండరు. ఈ మార్గంలో ఉన్న వాళ్ళను చూసి అప్పుడు ఆయన తృప్తి పడతాడు. "మానవ జన్మ సార్థకతను ఇప్పుడు చేసుకుంటున్నారు వీళ్ళు" అని. అందుకే "జ్ఞానులే నాకు ఇష్టులు" అని గీతలో శ్రీ కృష్ణ భగవానుడు ఊరికే అనలేదు.

ఎందుకంటే ఆయన ఎలా ఉండాలని మానవులను సృష్టించాడో, ఆ విధంగా మానవుడు ఉన్నప్పుడే కదా? ఇప్పుడు నా కొడుకు ఎలా ఉండాలని నేను ఊహించుకున్నానో, ఎలా చదవాలని ఊహించుకున్నానో అలా చదివినప్పుడే నాకు తృప్తి. భగవంతుడు కూడా మానవ జన్మ ఇచ్చి భూమిమీదకు పంపినప్పుడు, "నువ్వు నా అంతటి వాడివి కావాలి, నీకు సాయంగా పంచభూతాలను సృష్టించాను" అని చెప్పి పంపిస్తాడట.

ఆ పంచభూతాల సహాయంతో నువ్వు ఆయన అంతటి వాడివి కావాలి. భూమి నీకు సస్యాలను ఇస్తుంది, నీరు నీ దాహం తీరుస్తుంది, గాలి నీకు ప్రాణశక్తిని అందిస్తుంది, వాయువు నీకు మాట, బుద్ధి, మనసు అన్నీ ఇస్తుంది.

ఈ విధంగా పంచభూతాలను ఉపయోగించుకుని, సాధన ద్వారా

ఆయన అంతటి వాడివి కావాలి అని మనకు చెప్పి పంపిస్తాడట. మరి అది తెలుసుకోలేని వాళ్ళు మళ్ళీ మళ్ళీ వస్తారు. ఇది తెలుసుకుని ఆచరణలో పెట్టుకున్న వాళ్ళు కర్మలను తగ్గించుకుంటూ, జన్మలను తగ్గించుకుంటూ, జన్మే లేని స్థితికి వెళ్తారు.

అందుకనే మీలో ఇంకా ఇంకా పట్టుదల రావాలి, ఎక్కడైనా కొంచెం సోమరితనం ఉంటే, మీకు మీరు విచారణ చేసుకుంటూ, ముందుకు దాన్ని సరిచేసుకుంటూ ఉండాలి. ఎప్పుడు మీ లక్ష్యం, మీ గమ్యం మీకు గుర్తున్న రోజున మీలో అసలు సోమరితనమే రాదు. మీ లక్ష్యాన్ని, మీ గమ్యాన్ని మీరు మర్చిపోయినప్పుడే సోమరితనం మీలోకి ప్రవేశిస్తుంది.

ఎప్పుడైనా చూడండి, మీకు ముందు మీ గమ్యం గుర్తుంటే, మీరు ఏదైనా "రేపు పని" అనుకుంటే నిద్ర రాదు. అలాగే మీరు సత్యలోకం చేరాలి, కర్మలు దగ్ధం చేసుకోవాలి, సాధన పెంచుకోవాలి ఇలాంటి కోరికలు మీ మనసులో ఉంటే ఒక్క నిమిషం కూడా మీరు బద్దకించరు, సోమరితనం ఉండదు.

మీరు ఎంత ఎక్కువగా ప్రాపంచిక విషయాలు మాట్లాడినా, చర్చించినా, మీ దృష్టి వాటి మీదకు వెళ్ళినా అంతగా భగవంతుడికి దూరం అవుతూ ఉంటారు. కనీసం ఈ మూడు రోజులైనా మీ దృష్టి ధ్యానం మీద, జ్ఞానం మీద ఉంటే చాలా గొప్పగా ఎదుగుతారు.

మీరు అన్ని రకాల కబుర్లు చెప్పి ఫోన్ ఆఫ్ చేసి వచ్చి ధ్యానంలో కూర్చుంటే, మీరు విన్న ఆ విషయాలే పావుగంట పాటు మీలో తిరుగుతూనే ఉంటాయి. అదే నిద్రలోంచి లేచి, ఫ్రెష్‌గా స్నానం చేసి, కాస్త టీ తాగి కూర్చుంటే మీలో ఆ సాత్విక గుణం కంటిన్యూగా చక్కగా ఉంటుంది. మళ్ళీ సార్ "ఓకే" చెప్పే వరకు మీరు లేవరు. అసలు ఆ సాత్విక గుణంలో మిమ్మల్ని మీరు

నిలబెట్టుకోవాలి. లేచారు, మళ్ళీ ఆ ఫోన్ ఏంటి? ఆ ఫోన్ మాట్లాడి, మాట్లాడి వచ్చి కూర్చుంటే ఏమవుతుంది అంటే, అవే విషయాలు మీలోకి వస్తాయి.

ఎంత తక్కువగా ఫోన్ మాట్లాడితే మీరు అంత అదృష్టవంతులు. ఎంత ఎక్కువగా ఫోన్ మాట్లాడితే మీరు దురదృష్ట వంతులు కాదు శాపగ్రస్తులు. ఎంతగా విషయ ఆశక్తిని తగ్గించుకుంటారో, అంతగా ఆత్మ శక్తి పెరుగుతుంది. విషయాల మీద ఆసక్తిని మీరు తగ్గించుకోవాలి, అప్పుడు ఆటోమేటిక్‌గా ఆత్మ మీద ఆసక్తి వస్తుంది. విషయాలనే విషంగా మీరు సేవించడం మొదలు పెడితే, విషం ఒక్క సారే మనిషిని చంపేస్తుంది, విషయాలు మాత్రం రోజూ చంపుతాయి. అదే అష్టావక్రులు చెప్పారు. విషం ఎంత ప్రమాదకరమో, విషయాలు కూడా అంతే ప్రమాదకరం.

అందుకే మనసును పాడు చేసేది ఎవరు? విషయాలే. మనసును పాడు చేసేది విషం కాదు, విషయాలే. ఆ విషయాలకు ఎంత దూరంగా సాధకుడు ఉంటే అంత బాగుంటుంది. అందుకే భీమవరం వచ్చారు అంటే, కొత్త వాళ్ళకు మళ్ళీ చెప్తున్నాను మీ తమోగుణం, మీ బద్ధకం అన్నీ వదిలిపోయి ఇక్కడి నుంచి వెళ్ళేటప్పటికి తెల్లవారుజామున లేచే అలవాటు రావాలి. రాకపోతే ఒక ఆరు నెలలు రండి, ఆటోమేటిక్‌గా అలవాటు అవుతుంది. ఇంక తర్వాత మీరు “పడుకుందాం” అని ప్రక్కపై దొర్లినా నిద్ర రాదు, అంతగా అలవాటు అయిపోతారు.

ఒక్క బద్ధకం మీ జన్మలు పెరగడానికి కారణం అవుతుంది. బద్ధకం వదిలించుకుని, సోమరితనం వదిలించుకుంటే మీ కర్మలను తప్పించుకోవడానికి, మీ జ్ఞానాన్ని పెంచుకోవడానికి మీకు అవకాశం ఉంటుంది. మీరు చక్కగా మూడు గంటలు ధ్యానం చేసిన తర్వాత సార్ చెప్తున్న సబ్జెక్ట్‌లో ప్రతి విషయం మీ బ్రెయిన్‌లో నుంచి మీ హృదయంలోకి వెళ్ళిపోతుంది. అందుకే

పిల్లలను తెల్లవారుజామున లేపి చదివించడానికి కారణం ఏమిటంటే, ఆ సమయంలో చదువుకున్న చదువు బాగా బుర్రకి ఎక్కుతుంది. మరి ఇప్పుడు ఎలా చదువుతున్నారో నాకు తెలియదు. కానీ మా చిన్నతనంలో తెల్లవారుజామునే చదివే వాళ్ళం.

అందుకని మీలో ఉన్న పెద్ద అవలక్షణం సోమరితనమే. మీ ప్రతి పనిలో మీరు ఎలా ఉన్నారో గమనించుకోండి, మీకే అర్థమవుతుంది. మీ ప్రతి పనిని మీరు గమనించుకుంటే, మీరు ఏ స్థితిలో ఉన్నారో మీకే అర్థమవుతుంది.

ఆత్మజ్ఞానం పొందడానికి అన్నింటికంటే ముఖ్యంగా కావలసింది శ్రద్ధ, శ్రద్ధ లేని వారు జీవితంలో ఏ విషయాన్నీ సాధించ లేరు. కొద్దిగా జ్ఞానం వచ్చిన వెంటనే “నేను అన్నీ తెలుసుకున్నాను, నేను అన్నీ పొందాను” అని అనుకుని సాధన, స్వాధ్యాయంపై అశ్రద్ధ పెట్టడం జరుగుతుంది. ఇలా శ్రద్ధ తగ్గిపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి సోమరితనం. శరీరం కొద్దిగా అలసిపోయినా వెంటనే బద్ధకం, సోమరితనం ప్రవేశిస్తాయి. అవి మీలోకి ప్రవేశించిన తర్వాత మీలో ఉన్నఒక్కొక్కటిగా మంచి గుణాలను ఒక్కొక్కటిగా బలహీన పరుస్తూ, చెడు గుణాలకు స్థానం కల్పిస్తాయి. అందుకే సోమరితనాన్ని ఆధ్యాత్మికతకు ఒక ప్రధాన శత్రువుగా చెప్పవచ్చు. ఎవరైతే బద్ధకంగా ఉంటారో, ఎవరైతే సోమరితనానికి లోనవుతారో వారు సత్యం తెలిసినా, “నా వల్ల ఏమవుతుంది? ఇది నా వల్ల కాదు, ఇంత నిష్ఠగా సాధన చేయడం నా వల్ల కాదు” అని అనుకుంటూ వెనక్కి తగ్గిపోతారు.

అందుకే ఆత్మజ్ఞానం, బ్రహ్మ జ్ఞానం గురించి మహర్షులు ఏమి చెప్పారంటే “ఈ మార్గం సోమరులు ప్రయాణించే మార్గం కాదు, సోహం పరులు ప్రయాణించే మార్గం” అని. అంటే సోమరితనాన్ని వదిలి, నిరంతర

"శ్వాస మీద ధ్యాస" సాధనతో ముందుకు సాగే వారే ఈ మార్గంలో నిజమైన ప్రయాణికులు. సోహం అంటే ఏమిటి? మీరు పీల్చే శ్వాసలో "సో", వదిలే శ్వాసలో "హం" అనే సహజమైన ధ్వని ఉంటుంది. అందుకే "సోహం" అని అంటారు. చాలామంది దీనిని కేవలం ఒక మంత్రంగా భావిస్తారు. కానీ దీని అంతరార్థాన్ని గమనిస్తే, పీల్చే శ్వాసను, వదిలే శ్వాసను జాగరూకతతో గమనించడం ద్వారా మీరు మీలోకి ప్రయాణించవచ్చు అదే "శ్వాస మీద ధ్యాస".

పత్రి గారు ఈ సత్యాన్ని ఎంతో స్పష్టంగా మనకు తెలియజేశారు. శ్వాసను గమనించడం అనేది కష్టమైన పని కాదు, కానీ దాన్ని నిరంతరంగా చేయడానికి శ్రద్ధ, క్రమశిక్షణ, పట్టుదల అవసరం. ఈ మూడు లేకపోతే సోమరితనం మళ్ళీ మళ్ళీ మిమ్మల్ని వెనక్కి లాగుతుంది. సోమరితనానికి లోనైన వ్యక్తి సత్యాన్ని తెలుసుకున్నా దాన్ని ఆచరణలోకి తెచ్చుకోలేడు. ఫలితంగా సత్యాన్ని తెలుసుకునే అవకాశం ఉన్నప్పటికీ అసత్యాన్నే పట్టుకుని జీవిస్తూ ఉంటాడు. ''శ్వాస మీద ధ్యాస'' అనే ధ్యానం చేయుడానికి కూడా ప్రయత్నించకుండా, "ఇది నా వల్ల కాదు" అని అనుకోవడం కూడా సోమరి తనానికి ఒక రూపమే. నిజంగా చెప్పాలంటే పూజ చేయడం కంటే ధ్యానం చాలా సులభమైనది. అంతేకాదు, ధ్యానం ద్వారా కలిగే ఫలితం ఎంతో గొప్పది. కానీ సులభమైన పనినే చేయడానికి కూడా మనసు సిద్ధపడకపోతే, దానికి కారణం మీలో ఉన్న బద్ధకం, సోమరితనమే.

సత్యాన్ని తెలుసుకోవాలంటే మీ బుద్ధి వికసించాలి. సూక్ష్మమైన విషయాలను కూడా గ్రహించే సామర్థ్యం పెరగాలి. మీరు ఆధ్యాత్మికంగా ఎదిగిన మహనీయుల జీవితాలను పరిశీలించినప్పుడు, వారు ఒక్క రోజులో ఆ స్థితికి చేరుకోలేదని అర్థమవుతుంది. వారు ఎన్నో సంవత్సరాలు సాధన,

స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం చేశారు, తమ జీవితాన్ని జ్ఞాన మార్గంలో నడిపించారు. అందుకే వారు ఈరోజు మనకు ఆదర్శంగా నిలిచారు. వారి మార్గాన్ని మీరు కూడా అనుసరించాలంటే కేవలం వినడం సరిపోదు, మీరు కూడా అదే స్థాయిలో ప్రయత్నం చేయాలి. కానీ ప్రయత్నించకుండా ఆ స్థితిని పొందాలని కోరుకోవడం సాధ్యం కాదు.

సోమరితనం అంటే కేవలం శారీరకంగా బద్ధకంగా ఉండడం మాత్రమే కాదు, మంచి పని తెలిసినా చేయకపోవడం, చేయాల్సిన పనిని వాయిదా వేయడం, సాధనకు సమయం ఉన్నా సాధన చేయకపోవడం, పుస్తకం చదవాల్సి ఉన్నా చదవకుండా ఉండడం, సత్యాన్ని తెలుసుకోవాలనే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చేయడం కూడా సోమరితనమే. అందుకే సోమరితనం అజ్ఞానానికి ఒక నిద్రలాంటిదని చెప్తారు.

నిద్రలో ఉన్న వాడికి తన చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా తెలియదో, అలాగే అజ్ఞానమనే నిద్రలో ఉన్నవాడికి జ్ఞానం యొక్క విలువ, సత్యం యొక్క గొప్పతనం పూర్తిగా అర్థం కాదు. జ్ఞానం ఎదురుగా ఉన్నా, దాన్ని గ్రహించే ప్రయత్నం చేయడు. అర్థం కాకపోతే బాధపడతాడు, కష్టపడతాడు, దుఃఖ పడతాడు. కానీ ఆ బాధకు మూలకారణమైన అజ్ఞానాన్ని తొలగించడానికి మాత్రం ప్రయత్నించడు. అందుకే మీరు మీ జీవితంలో ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ముందుగా మీలోని సోమరితనాన్ని గమనించాలి. “నేను ఎందుకు సాధన చేయడం లేదు? నేను ఎందుకు స్వాధ్యాయం చేయడం లేదు? నాకు తెలిసిన విషయాలను ఎందుకు ఆచరణలో పెట్టడం లేదు? చేయాల్సిన పనిని ఎందుకు వాయిదా వేస్తున్నాను?” అని మీకు మీరే ప్రశ్నించుకోవాలి. ఈ విచారణ మొదలైనప్పుడే మీలో మార్పు మొదలవుతుంది.

మీరు సోమరితనాన్ని జయించి, శ్రద్ధతో సాధన చేసి, నిరంతరంగా

స్వాధ్యాయం చేస్తూ, సజ్జన సాంగత్యంలో ఉంటే మీ బుద్ధి క్రమంగా వికసిస్తుంది, మీలో వివేకం పెరుగుతుంది, జ్ఞానాన్ని గ్రహించే శక్తి పెరుగుతుంది. అప్పుడు అజ్ఞానమనే నిద్ర తొలగి, జ్ఞానమనే మెలకువ కలుగుతుంది. కాబట్టి ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళాలనుకునే ప్రతి ఒక్కరూ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. శ్రద్ధను పెంచుకోవాలి, సోమరితనాన్ని వదలాలి, సాధనను నిరంతరం కొనసాగించాలి. అప్పుడు మాత్రమే ఆత్మజ్ఞానం వైపు మీ ప్రయాణం వేగంగా సాగుతుంది, ఆత్మజ్ఞానం ద్వారా బ్రహ్మ జ్ఞానం వైపు మీరు ఎదగ గలుగుతారు.

చూడండి, నిద్రలో ఉన్న వాడికి తన చుట్టూ ఉన్న బాహ్య ప్రపంచం ఎలా తెలియదో, అలాగే అజ్ఞానం అనే నిద్రలో ఉన్నవాడికి జ్ఞానం యొక్క విలువ, సత్యం యొక్క గొప్పతనం అర్థం కాదు. జ్ఞానం ఎదురుగా ఉన్నా దాన్ని గ్రహించలేడు, విన్నా అర్థం చేసుకోలేడు, అర్థం కాకపోవడం వల్ల ఎప్పుడూ దుఃఖపడుతూనే ఉంటాడు, బాధపడుతూనే ఉంటాడు, కష్టపడుతూనే ఉంటాడు. అందుకే అజ్ఞానంలో ఉన్నవాడికి కష్టాలు నేల మీద బరువు మోసినట్టుగా అనిపిస్తాయి. ఈ విషయాన్ని మీరు చాలా జాగ్రత్తగా గమనించాలి.

నేల మీద ఒక బరువు పెట్టి దాన్ని పైకి తీయాలంటే చాలా కష్టం. అదే బరువును నీటిలోకి తీసుకెళ్ళి పైకి తీయాలంటే చాలా సులభంగా ఉంటుంది. అందుకే జ్ఞానికి కష్టాలు నీటిలో నుంచి బరువు తీసినట్టుగా ఉంటాయి, అజ్ఞానికి మాత్రం నేల మీద నుంచి బరువు తీసినట్టుగా అనిపిస్తాయి.

మరి ఈ అజ్ఞానం ఎందుకు వచ్చింది? సత్యాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నం చేయకపోవడం వల్ల వచ్చింది; ఆ ప్రయత్నం చేయకపోవడానికి ప్రధాన కారణం సోమరితనం. సత్యం ఎదురుగా ఉన్నా, సత్యాన్ని తెలుసుకున్నా, దాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి, ఆచరణలో పెట్టడానికి మీరు

ప్రయత్నించకపోతే సత్యం మీకు అవగాహన కాదు. అందుకే శంకరాచార్యులు మానవ జన్మ యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ మనుష్యత్వం, ముముక్షుత్వం వంటి అరుదైన అవకాశాల గురించి చెప్పారు. ముముక్షుత్వం అంటే మోక్షాన్ని పొందాలనే తీవ్రమైన కోరిక. మానవ జన్మ వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆత్మజ్ఞానాన్ని పొందే అవకాశం ఉంది, మోక్షాన్ని పొందే అర్హత ఉంది, సద్గురువుల బోధలను స్వీకరించి ఆచరించే అవకాశం ఉంది.

పత్రి గారు కూడా ఎంతో మందికి సాధన గురించి, సాధనలో మెలకువల గురించి, స్వాధ్యాయం గురించి, సజ్జన సాంగత్యం గురించి, ఇంకా ఎన్నో విషయాల గురించి చెప్పారు. అయితే కొంత మంది ప్రాపంచిక లాభాల కోసం ధ్యాన మార్గంలోకి వచ్చారు. ధ్యాన మార్గంలోకి వచ్చిన తర్వాత కూడా జ్ఞాన పరంగా ఎదగలేక పోయారు. ఎన్ని సంవత్సరాలు సాధన చేసినా, అదే స్థాయిలో ఉండిపోవడానికి కారణం సాధనలో లోపం కాదు; సాధన పట్ల మీలో ఉన్న శ్రద్ధలో లోపం. అందుకే మీరు ఒక విషయాన్ని గమనించాలి. చాలామంది క్లాస్ అంటే అనుభవాలు చెప్పడం, ఎవరో చెప్పిన అనుభవాలను మరోసారి చెప్పడం వరకే పరిమితం అవుతున్నారు.

కానీ అసలు సబ్జెక్ట్‌పై, జ్ఞానంపై, దాని లోతైన అర్థంపై తగినంత దృష్టి పెట్టడం లేదు. నేను ఎన్నో క్లాసులకు వెళ్తూ ఉంటాను. అక్కడ చాలామంది నాకు ఒక మాట చెప్తూ ఉంటారు “మీ శిష్యులు చాలా బాగా సబ్జెక్ట్ చెప్తారు” అని. ఆ ఒక్క మంచి మాట నాకు కోటి రూపాయల మూటలా అనిపిస్తుంది. ఎందుకంటే మీలో చాలామంది సోమరితనాన్ని వదిలి తెల్లవారుజామున నాలుగు గంటలకే ధ్యానంలో కూర్చుని ఆరున్నర వరకు మనసును శుద్ధి చేసుకుంటున్నారు. ఆ తర్వాత జ్ఞానాన్ని వింటున్నారు. అంతటితో ఆగకుండా, క్లాసుల్లో, జూమ్‌లో చెప్పాలి అనే తపనతో మళ్ళీ అదే విషయాన్ని అధ్యయనం

చేస్తున్నారు. అంటే మీలో ఉన్న సోమరితనాన్ని మీరు జయించగలిగారు. కాబట్టే మీరు ఇంతగా ఎదిగి, బయటి వారి నుంచి కూడా ప్రశంసలు పొందుతున్నారు.

పత్రి గారు ఎప్పుడూ చెప్పినట్టు స్వాధ్యాయం లేకుండా, సజ్జన సాంగత్యం లేకుండా, సాధనను సరిగా చేయకుండా కేవలం అనుభవాలు చెప్పడం వల్ల ఆధ్యాత్మికంగా చాలా దూరం వెళ్ళలేరు. ఎవరో ఒకరి అనుభవం చెప్పి క్లాస్ పూర్తి చేయవచ్చు, కానీ సబ్జెక్ట్ పరంగా, జ్ఞాన పరంగా ముందుకు వెళ్ళలేరు. మిమ్మల్ని సబ్జెక్ట్ పరంగా ముందుకు తీసుకెళ్ళాలనే ఉద్దేశంతోనే పత్రి సార్ స్వాధ్యాయం, స్వాధ్యాయం అని పదే పదే చెప్పేవారు. ఎన్నో సందర్భాల్లో ఆయన, “నాకు చాలా ఇష్టమైన పని స్వాధ్యాయం” అని చెప్పారు. ఆయన స్వయంగా చదివేవారు, అధ్యయనం చేసేవారు. మీరు కూడా ఆయన మార్గాన్ని అనుసరించి కొంచెమైనా స్వాధ్యాయం చేస్తే, ఆయనకు తగ్గ శిష్యులుగా మీరు ఎదగగలుగుతారు. కానీ దానికి ముందుగా మీలోని సోమరితనాన్ని వదలాలి.

ఆధ్యాత్మికంగా ఎవరైనా ఎదగలేక పోతున్నారు అంటే, వాళ్ళలో ఉండే సోమరితనం ఒక ప్రధాన కారణం. పుస్తకాలు కొంటారు, బీరువాల్లో పెడతారు, షోకేసుల్లో అందంగా అమర్చుకుంటారు. “మేము ఇన్ని గొప్ప గొప్ప పుస్తకాలు కొన్నాము” అని గర్వంగా చెప్తారు. పెద్ద పెద్ద పుస్తకాలు ఉంటాయి. కానీ “అందులో కనీసం రెండు పేజీలైనా చదివారా?” అని అడిగితే, “ఇంకా చదవలేదండి, ఇంకా తీయలేదండి” అంటారు.

నిజంగా చదవాలనే తపన ఉంటే సోమరితనాన్ని, బద్ధకాన్ని ప్రక్కన పెట్టి, పుస్తకం కొన్న వెంటనే కనీసం దాని వెనుక ఉన్న సారాంశాన్ని అయినా చదువుతారు. కాబట్టి మీరు సాధన చేయలేకపోవడానికి, స్వాధ్యాయం

చేయలేకపోవడానికి, జ్ఞానాన్ని లోతుగా గ్రహించ లేకపోవడానికి మీలోని సోమరితనమే ఒక ప్రధాన కారణం. ఈ సోమరితనం పురుష ప్రయత్నాన్ని చేయనివ్వదు. అందుకే వశిష్ఠుల వారు కూడా సోమరితనం ఉన్నవాడు గట్టి ప్రయత్నం చేయలేడని చెప్పారు. భూమ్మీద అజ్ఞానంగా పుట్టి జ్ఞానిగా ఎదిగిన ప్రతి మహనీయుడి వెనుక నిరంతర ప్రయత్నం ఉంటుంది. వారు తమ మనసులో సోమరితనానికి చోటు ఇవ్వలేదు.

మీరు కూడా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే సోమరితనాన్ని వదలాలి. సోమరితనం ఉంటే ప్రతి పనినీ వెనక్కి నెట్టేస్తూ, “రేపు చేస్తాను, రేపు చేస్తాను” అని వాయిదా వేస్తూ ఉంటారు. కానీ జ్ఞాని పత్రి గారు మనకు ఎన్నో సందర్భాల్లో ఒక గొప్ప మాట చెప్పేవారు “రేపటి పని ఈవేళ, ఈవేళ పని ఇప్పుడే చేయాలి” అని. జ్ఞానిగా ఎదగాలనుకునే వ్యక్తి ఈ మాటను తన జీవితంలో ఆచరణలో పెట్టాలి. కృషి చేసేవాడు ఇప్పుడే చేయాల్సిన పనిని ఇప్పుడే చేస్తాడు. సోమరుడు మాత్రం ఈరోజు చేయాల్సిన పనిని రేపటికి వాయిదా వేస్తాడు.

కాబట్టి మీరు మీలో సోమరితనం ఉందో లేదో తెలుసుకోవడానికి ఒక చిన్న పరీక్ష చేసుకోవచ్చు. “ఈరోజు చేయాల్సిన పనిని ఈరోజే పూర్తి చేశానా? లేక రేపటికి వాయిదా వేశానా?” అని మీకు మీరే ప్రశ్నించుకోండి. ఈరోజు పని రేపటికి వాయిదా వేస్తే మీలో సోమరితనం ఉన్నట్టే. ఈరోజు చేయాల్సిన పనిని ఈరోజు పూర్తి చేస్తే మీలో బద్ధకం తగ్గుతున్నట్టే. అలాగే మీరు ఒక టాపిక్ వింటే, ఆ టాపిక్ పుస్తకం చూడకుండా కూడా చెప్పగలిగే స్థాయికి రావాలి. మళ్ళీ మళ్ళీ పుస్తకం చూసి చెప్పడం వల్ల భయం పోవచ్చు కానీ జ్ఞానం రాదు. మీరు క్లాస్‌కు వెళ్ళినప్పుడు పుస్తకం చూడకుండా ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పగలుగుతున్నారంటే మీలో చెప్పగలిగే సామర్థ్యం

ఉంది అని తెలుసుకోవచ్చు.

కాబట్టి, చూడకుండా చెప్పడానికి ప్రయత్నిస్తే మీలోని ధైర్యం, జ్ఞానం, చెప్పే సామర్థ్యం ఇంకా బాగా పెరుగుతాయి. మరి ఈ సోమరితనాన్ని పూర్తిగా వదలాలంటే ఒకటే మార్గం నిరంతర ధ్యాన సాధన. సాధనను రోజూ కొనసాగించాలి. సోమరితనం వల్ల నిద్రలోకి జారిపోకుండా, బద్ధకంగా కూర్చోకుండా ప్రతిరోజూ స్నానం చేసి సాధనకు కూర్చోండి. ఎందుకంటే సోమరితనం మీలో ఉంది అంటే మీ శరీరం, మనసు రెండూ చురుకుదనం కోల్పోతున్నాయని అర్థం. శరీరం, మనసు చురుకుగా ఉండాలంటే శుభ్రత, క్రమశిక్షణ, సాధన అవసరం. మరి సాధన చేస్తున్నప్పటికీ ఇంకా బద్ధకం, సోమరితనం ఉంటే, “నా ఆహార నియమం సరిగ్గా ఉందా? నేను అతిగా ఆహారం తీసుకుంటున్నానా?” అని మీకు మీరే పరిశీలించుకోవాలి. అతిగా తింటే శరీరం బరువుగా మారి నిద్ర, బద్ధకం పెరుగుతాయి. మితంగా తింటే శరీరం చురుకుగా పని చేస్తుంది.

**“మంచి స్నేహితులతో స్నేహం మిమ్మల్ని ఉన్నత స్థితికి తీసుకెళ్ళినట్టే, మంచి ఆధ్యాత్మిక జీవన విధానం మానవుడిని దైవత్వం వైపు తీసుకెళ్తుంది”.** మీ స్నేహం ఎవరితో ఉండాలి? చివరికి మీ స్నేహం మీ ఆత్మతో ఏర్పడాలి. సోహం స్థితికి చేరుకోవాలంటే ముందుగా సోమరితనాన్ని వదలాలి. సోమరితనాన్ని వదిలి మీరు స్వాధ్యాయం చేయాలి, సజ్జన సాంగత్యం చేయాలి, సాధన చేయాలి, తెలుసుకున్న జ్ఞానాన్ని పది మందికి పంచాలి. ఖాళీ దొరికితే కళ్ళు మూసుకుని ధ్యానం చేయండి; కానీ పుస్తకాలను కూడా ఎక్కువగా చదవండి. మీరు గంటలు గంటలు అధ్యయనం చేస్తేనే కొత్త కొత్త విషయాలు తెలుస్తాయి. అప్పుడు “అబ్బో, ఈ విషయం మీద నేను ఇంకా దృష్టి పెట్టలేదు, ఇది నాకు ఇంకా తెలియదు” అనే వినయం మీలో వస్తుంది. అదే నిజమైన

జ్ఞానానికి ప్రారంభం.

ఆధ్యాత్మికత అంటే ఒక్కరోజు ఒక పుస్తకంలో ఒక టాపిక్ చదివి, అదే టాపిక్‌ను పది మందికి చెప్పడం మాత్రమే కాదు. ఈ సృష్టిలో మేరు పర్వతమంత జ్ఞానం ఉంది. దాన్ని పూర్తిగా నేర్చుకోవడానికి ఒక మనిషి ఆయుష్షు సరిపోతుందో లేదో కూడా తెలియదు. అందుకే ఎక్కువగా చదివే కొద్దీ ఎక్కువ జ్ఞానం లభిస్తుంది. కొంతమంది "ఈ జన్మకు ఇది చాలు, స్వాధ్యాయం వచ్చే జన్మలో చేస్తాను" అని అంటున్నారు. అలాంటి మాటలు వినిపించినప్పుడు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. వచ్చే జన్మలో మీరు ఎలా పుడతారో, ఈ జ్ఞానం మీకు గుర్తుంటుందో లేదో, ఈ సాధన మార్గంలోనే కొనసాగుతారో లేదో మీకు తెలుసా? గురువులు "ఈరోజు చేయాల్సిన పనిని రేపటికి వాయిదా వేయొద్దు" అని చెప్తుంటే, ఈ జన్మలో చేయాల్సిన జ్ఞాన సాధనను వచ్చే జన్మకు వాయిదా వేయడం ఎంతటి సోమరితనం! గురువు చెప్పింది వినడం మాత్రమే కాదు, ఆచరించడం మీ కర్తవ్యం.

గురువు చెప్పినది మీరు ఆచరించినప్పుడే మీ జీవితంలో నిజమైన మార్పు వస్తుంది. పత్రి గారు చెప్పినట్టు, జీవితంలో ఎదగడానికి సాధన ఎంత ముఖ్యమో స్వాధ్యాయం కూడా అంతే ముఖ్యం. సజ్జన సాంగత్యంలో కొంత జ్ఞానం లభిస్తుంది. కానీ స్వాధ్యాయంలో ఎన్నో విషయాలను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఒకసారి "సార్, నేను ఏ విషయంలోనైనా ఫస్ట్‌గా ఉండాలి" అని మీరు అనుకుంటే, దానికి ఆయన చెప్పే సింపుల్ టెక్నిక్ "స్వాధ్యాయం ఎక్కువగా చేయి, నువ్వు ఫస్ట్ అవుతావు" అనేది. అందుకే సోమరితనాన్ని వదిలిన వారు సాధనను వదలరు, స్వాధ్యాయాన్ని వదలరు, అవకాశం వచ్చినప్పుడల్లా సజ్జన సాంగత్యానికి వెళ్తారు. సోమరితనం వల్ల సజ్జన సాంగత్యానికి కూడా వెళ్ళకుండా ఉంటే, తర్వాత మీలో ఒక వెలితి

కలుగుతుంది. "అయ్యో, వాళ్ళు పిలిచారు, నేను వెళ్ళలేకపోయాను" అని బాధపడతారు. మీరు ఆత్మజ్ఞానం పొందిన కొద్దీ ఆ జ్ఞానాన్ని మీ దగ్గరే దాచుకోకుండా, నేర్చుకోలేని వారికి పంచాలనే బాధ్యత మీలో పెరగాలి. ఎందుకంటే సత్యాన్ని తెలుసుకోవడం కేవలం మీతోనే ముగియడానికి కాదు. సత్యాన్ని పంచాలి, అసత్యాన్ని ఖండించాలి. మీరు సత్యాన్ని పంచినప్పుడు మరొకరు ఎదుగుతారు, మరొకరు ఎదిగినప్పుడు ఆ జ్ఞానం మరింత విస్తరిస్తుంది. కాబట్టి సోమరితనాన్ని జయించడం అంటే కేవలం ఒక చెడు అలవాటును వదిలేయడం కాదు, మీ జీవితాన్ని పూర్తిగా మార్చుకోవడం.

"నా జీవితంలో నేను వెనుకబడిపోవడానికి కారణం ఈ సోమరి తనమే" అని మీరు ఎప్పుడైతే నిజంగా గుర్తిస్తారో, అప్పుడే దాన్ని వదిలే ప్రయత్నం మొదలవుతుంది. ముందుగా మీకు మీరే విచారణ చేసుకోవాలి. "నేను ఎందుకు ఎదగడం లేదు? నేను ఎందుకు సాధనలో ముందుకు వెళ్ళడం లేదు? నేను ఎందుకు స్వాధ్యాయం చేయడం లేదు? నాకు తెలిసినదాన్ని ఎందుకు ఆచరణలో పెట్టడం లేదు?" అని ప్రశ్నించుకోవాలి. మీతో ప్రారంభించిన వాళ్ళు మీకంటే అద్భుతంగా క్లాసులు చెప్తున్నారు, మీకంటే అద్భుతంగా సాధన చేస్తున్నారు అంటే కారణం గురువు చెప్పిన జ్ఞానంలో తేడా కాదు. మీరు చేసే ప్రయత్నంలో తేడా. మీలో సోమరితనం ఉంటే మీరు ప్రయత్నించరు. ఏదో క్లాసులో కూర్చుని వింటారు, ఏదో క్లాసులో కూర్చుని సాధన చేస్తారు, కానీ నోట్స్ కూడా వ్రాయరు. చదువగలిగిన వారు కూడా వ్రాయడానికి బద్ధకిస్తారు. కొంతమంది క్లాస్‌లో కూర్చుని ఒక కన్ను ప్రక్క వాడి మీద, ఒక చెవి ప్రక్కవాడి మాట మీద పెట్టి, కళ్ళు మూసుకుని "ధ్యానంలో ఉన్నాను" అంటారు.

గురువు గారు పాఠం చెప్తున్న సమయంలో మీరు ధ్యానంలోకి వెళ్ళిపోయి, ఆయన చెప్పేది కూడా వినలేకపోతే అది నిజమైన శ్రద్ధ కాదు.

గురువు చెప్పే జ్ఞానాన్ని గ్రహించే శక్తి తగ్గిపోవడానికి కారణం మీలో సరైన శ్రద్ధ లేకపోవడం. శ్రద్ధ లేకపోవడానికి కారణం సోమరితనం, బద్ధకం. ఎంతసేపు మీలో శ్రద్ధ ఉండదో, ఎంతసేపు బద్ధకం, సోమరితనం ఉంటాయో, అంతవరకు అజ్ఞానం తొలగదు. అజ్ఞానం ఉన్నంతకాలం బాహ్యమైన కోరికలే ప్రధానంగా ఉంటాయి. మీ దృష్టి బాహ్య ప్రపంచం చుట్టూనే తిరుగుతుంది. అందుకే కైవల్య ఉపనిషత్తు బోధన యొక్క సారాంశాన్ని గమనిస్తే, మీరు చేసే సాధన మీ ప్రాపంచిక కోరికలను క్రమంగా తగ్గించి, మీ దృష్టిని పరమాత్మ వైపు మళ్లించాలి. సాధన మిమ్మల్ని బయట నుంచి లోపలికి తీసుకెళ్ళాలి. గురువు అందరికీ ఒకే జ్ఞానాన్ని చెప్తారు; కానీ కొందరు ముందుకు వెళ్తారు, కొందరు వెనుకే ఉంటారు. దానికి కారణం గురువు బోధనలో తేడా కాదు, మీ ఆచరణలో తేడా.

సాధన చేయకపోవడానికి ప్రధాన కారణం మళ్ళీ సోమరితనమే. “చాల్లే, ఈరోజు గంట చేశాం, ఇంక చాలు” అని అనుకునేవారికి పరిమితమైన లాభమే ఉంటుంది. “ఇంకా ఎదగాలి, ఇంకా తెలుసుకోవాలి, ఇంకా సాధన చేయాలి” అని తపన పడేవారికి అపరిమితమైన లాభం కలుగుతుంది. సాధన మీలో ముందుగా శుద్ధత్వాన్ని పెంచుతుంది. స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం మీలో బుద్ధత్వాన్ని పెంచుతాయి. సోమరితనాన్ని వదిలి సాధన చేస్తే మీరు శుద్ధత్వం వైపు ఎదుగుతారు. స్వాధ్యాయం చేసి, సజ్జన సాంగత్యం చేస్తే బుద్ధత్వం మరింత వికసిస్తుంది. శుద్ధత్వం, బుద్ధత్వం పెరిగినప్పుడు మీరు బ్రతికి ఉండగానే మోక్షస్థితిని అనుభవించగలుగుతారు.

చూడండి, చిన్నదిగా కనిపించే సోమరితనం మనిషిని ఎంత దిగువ స్థితికి తీసుకెళ్ళగలదో! అదే సోమరితనాన్ని వదిలినప్పుడు ఎంత ఉన్నత స్థితికి ఎదగగలరో! మీరు మీ జీవితంలో అనుభవించాలి. గురువులు మార్గాన్ని

చూపిస్తారు. ఆ మార్గంలో నడవాల్సింది శిష్యులే. శిష్యుల్లో ఆచరణ ఎందుకు ఉండడం లేదు అని పరిశీలిస్తే, ముందుగా విన్న విషయాలపై శ్రద్ధ లేదు. విన్నా అర్థం కావడం లేదు అంటే అర్థం చేసుకోవడానికి ప్రయత్నం లేదు. ప్రయత్నం లేకపోవడానికి కారణం సోమరితనం. అందుకే బద్ధకం, సోమరితనం, శ్రద్ధ లేకపోవడం ఈ మూడు ఆధ్యాత్మిక ఎదుగుదలకు పెద్ద అడ్డంకులు. వీటిని వదిలి శ్రద్ధతో సాధన చేస్తే మీరు అత్యున్నత స్థాయికి ఎదగగలుగుతారు.

కొన్ని సంవత్సరాలు, కొన్ని జన్మలు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, నిజమైన తపనతో, నిరంతర సాధనతో, శ్రద్ధతో జీవిస్తే చాలా వేగంగా ఆధ్యాత్మికంగా ఎదగవచ్చు. మోక్షం అంటే ఎక్కడికో వెళ్ళి పొందే ఒక వస్తువు కాదు, నిత్యమైన ఆనంద స్థితిలో ఉండగలగడమే మోక్షం. సాధన చేస్తున్నప్పుడు ఆనందం కలగాలి, స్వాధ్యాయం చేస్తున్నప్పుడు ఆనందం కలగాలి, జ్ఞానాన్ని ఇతరులకు చెప్తున్నప్పుడు ఆనందం కలగాలి, ఎవరి దగ్గరైనా కొత్త విషయాన్ని నేర్చుకుంటున్నప్పుడు ఆనందం కలగాలి. ఈ ఆనందం మీ అంతరంగంలోనే నిరంతరం ఉంటే, మీరు నిత్య మోక్ష స్థితిని అనుభవిస్తున్నట్టే.

అప్పుడు ప్రాపంచిక విషయాలపై అనవసరమైన ఆసక్తి క్రమంగా తగ్గుతుంది. అవసరమైన పనులను మాత్రం కర్తవ్యంగా చేస్తారు. అందుకే మీరు ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయికి ఎదగాలంటే మొదటగా ఒక సంకల్పం చేసుకోవాలి. సోమరితనానికి నా జీవితంలో స్థానం లేదు, శ్రద్ధతో సాధన చేస్తాను, నిరంతరం స్వాధ్యాయం చేస్తాను, సజ్జన సాంగత్యంలో ఉంటాను, తెలుసుకున్న సత్యాన్ని ఆచరిస్తాను, ఇతరులతో పంచుకుంటాను. ఈ సంకల్పం ఆచరణలోకి వచ్చిన రోజే మీ ఆధ్యాత్మిక ప్రయాణం మరింత వేగంగా ముందుకు సాగుతుంది.

# కర్మమార్గం - జ్ఞాన మార్గం

ప్రతి ఒక్కరూ కర్మ సిద్ధాంతాన్ని తెలుసుకుంటే ఏ కర్మ చేయాలి? ఏ కర్మ చేయకూడదు? అనేది స్పష్టంగా అర్థమవుతుంది. అజ్ఞాని ఎలాంటి కర్మలు చేస్తాడు, జ్ఞాని ఎలాంటి కర్మలు చేస్తాడు అనేది స్పష్టంగా తెలుస్తుంది. చాలామంది కర్మ మార్గం ద్వారా కూడా మోక్షానికి వెళ్ళవచ్చని అంటారు. కానీ కర్మ మార్గం మోక్షాన్ని ఇవ్వదు, మోక్షానికి వెళ్ళే మార్గాన్ని చూపిస్తుంది. కర్మ మార్గం ద్వారా మోక్షం రాదు, ధ్యాన మార్గం ద్వారానే జీవుడు తన అసలు స్వరూపాన్ని తెలుసుకుని, దేవుడిగా మారగలడు, మోక్షాన్ని పొందగలడు.

మరి అజ్ఞాని కర్మ ఎలా చేస్తాడు అంటే ఫలాపేక్షతో చేస్తాడు. “ఈ పని చేస్తే నాకు ఈ లాభం వస్తుంది” అనే ఆలోచనతో కర్మ చేస్తాడు. అజ్ఞాని చేసే కర్మల వెనుక ఏదో ఒక ఫలాన్ని పొందాలనే ఆశ ఉంటుంది. కానీ జ్ఞాని ఫలాపేక్షతో కర్మలు చేయడు, నిష్క్రమ కర్మలు, యజ్ఞ కర్మలు చేస్తాడు.

అజ్ఞాని కర్మలను స్వార్థంతో చేస్తాడు, ఎందుకంటే అందరూ ఆత్మ స్వరూపులే అనే సత్యం అజ్ఞానానికి తెలియదు. కర్మ ఎలా చేయాలో కూడా తెలియక, “ఈ పని చేస్తే పుణ్యం వస్తుంది, ఈ పని చేస్తే మోక్షం వస్తుంది” అనే భావంతో కర్మలు చేస్తాడు. మోక్షం అనేది కర్మ ఫలంగా రాదనే విషయం తెలియక, “మోక్షం, మోక్షం” అని కర్మలను ఫలాపేక్షతో చేస్తూ ఉంటాడు.

జ్ఞాని మాత్రం కర్మ తనకు బంధంగా మారకుండా చూసుకుంటాడు. “నేను ఈ కర్మ చేస్తున్నాను కాబట్టి, దాని ఫలితంగా వచ్చే పుణ్యాన్ని కూడా నేను ఆశిస్తే, ఆ పుణ్య ఫలం నా మరుజన్మకు కారణమవుతుంది” అని జ్ఞాని తెలుసుకుంటాడు. అందుకే ఫలాన్ని ఆశించకుండా నిష్కామంగా కర్మ చేస్తాడు. అందరూ ఆత్మ స్వరూపులే అయినప్పటికీ, కొందరు మాత్రమే జ్ఞానంలోకి వస్తారు. మరికొందరు ఇంకా కర్మ మార్గంలోనే ఉంటారు. దానికి కారణం

కోరికలు, కామం. ఆ కోరిక శరీరానికి సంబంధించినదైనా కావచ్చు, మనసుకు సంబంధించినదైన కావచ్చు. కోరికతో చేసే ప్రతి కర్మ కూడా మరుజన్మకు కారణమవుతుంది.

అందరూ ఆత్మ స్వరూపులే అయినా, కోరికల వల్ల అజ్ఞాని తన ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోలేడు. కొంత జ్ఞానం వచ్చినా, కోరికలను వదలకపోతే మళ్ళీఆ కోరికలతోనే కలవరపడుతూ ఉంటాడు. మీరందరూ కూడా సాధన చేస్తున్నారు, సాధన ఎలా చేయాలి? “సాధన భగవంతుని చేరుకోవడానికి మార్గం” అనే భావంతో సాధన చేయాలి. “నేను ఈ సాధన చేస్తే నాకు మోక్షం వస్తుంది” అనే ఆశతో సాధన చేయకూడదు. అందుకే పత్రి గారు ఎప్పుడూ “చేయడం నా ధర్మం, చేయడం నా కర్తవ్యం” అని చెప్పేవారు. మానవ జన్మకు అసలైన కర్తవ్యం యోగమే. చివరికి యోగం ద్వారా జ్ఞానాన్ని పొంది, “నేనెవరు?” అన్నది తెలుసుకున్నప్పుడే మోక్షాన్ని పొందగలరు.

అందుకే ఏ కోరికతో సాధన చేయకూడదు. సాధన కూడా ఒక కోరికను నెరవేర్చుకోవడానికి చేస్తే, అది కూడా కామ్యకర్మగా మారుతుంది. కామ్యకర్మలను ఎక్కువగా చేస్తూ ఉంటే, ఆ కామం మీలో ఉన్న మంచి లక్షణాలను కూడా క్రమంగా చెడు లక్షణాలుగా మారుస్తాయి.

ప్రతి ఒక్కరిలోనూ ఆత్మ ఉందని జ్ఞాని తెలుసుకుంటాడు, కానీ కోరికలతో కర్మలు చేసే వారికి ఈ సత్యం లోతుగా తెలుసుకునే అవకాశం ఉండదు, కోరికే ఆత్మను దర్శించకుండా అడ్డుకుంటుంది. “ఇది వస్తుంది, అది వస్తుంది” అనే ఆశతో సాధన చేస్తూ ఉంటే, మీరు ఎంత సాధన చేస్తున్నారో తెలియదు, సాధన ద్వారా ఎంత జ్ఞానం పొందుతున్నారో కూడా తెలియదు. అలాంటి కోరికలతో మీరు ఇంకా ఎన్నాళ్ళు సాధన చేస్తారు? కోరికను వదిలిన

రోజునే ఆత్మ దర్శనానికి మీ ప్రయాణం నిజంగా ప్రారంభమవుతుంది. మరి కోరికను వదలాలంటే ఏమి రావాలి? వైరాగ్యం, విచారణ, వివేకం ఈ మూడు రావాలి. ప్రాపంచిక విషయాల మీద వైరాగ్యం ఉండాలి, ఆత్మ మీద ఆసక్తి ఉండాలి. మీ కోరికలను తగ్గించుకోవాలంటే ప్రతి పనిలోనూ విచారణ ఉండాలి. "నేను సాధన చేస్తూ ముందుకు వెళ్ళాలంటే ప్రాపంచిక కోరికలను కోరుకోవాలా? లేక ఆధ్యాత్మికంగా ఆత్మోన్నతిని కోరుకోవాలా?" అని మీరు విచారణ చేసుకోవాలి. ముందు వైరాగ్యం, తర్వాత విచారణ, తర్వాత వివేకం. "ఏ పని చేస్తే నా ఆత్మ శక్తి పెరుగుతుంది? ఏ పని చేస్తే నా ఆత్మ శక్తి తగ్గుతుంది?" అనే వివేకం మీలో ఉండాలి. ఇంద్రియ నిగ్రహం లేని వ్యక్తి తన ఆత్మ శక్తిని తగ్గించుకుంటాడు. చూసిన దంతా కావాలి అనే కోరిక ఉన్న వాడు తన ఆత్మ శక్తిని ఎక్కువగా ఖర్చు చేసుకుంటూ ఉంటాడు. అజ్ఞానికి ఇది తెలియదు, ఇంద్రియ నిగ్రహం లేకపోవడం వల్ల సంపాదించిన శక్తి కొద్దిగా ఉన్నా, దాన్ని ఖర్చు చేసేది ఎక్కువగా ఉంటుంది.

అందుకే అష్టావక్ర గీత ఒక విషయాన్ని చెప్తుంది. విషం తిన్నవాడు ఒక్క సారే మరణిస్తాడు, విషం తిన్న వెంటనే దాని ప్రభావం చూపుతుంది. కానీ విషయాసక్తి ఉన్న వాడికి విషయాన్ని చూసిన క్షణం నుంచే దాని ప్రభావం మొదలవుతుంది. కాబట్టి మీరు ఏదైనా ఒక వస్తువును చూసినప్పుడు, దాని మీద ఆసక్తి పెరిగినప్పుడు, అక్కడి నుంచే మీ మనస్సులో విషయాసక్తి మొదలైనట్టు. కోరిక అనేది జ్ఞానికి మరణంతో సమానం, కోరికల వల్ల మళ్ళీ కర్మలు చేస్తారు, కర్మల వల్ల మళ్ళీ జన్మలు వస్తాయి. కాబట్టి మీరు ఏది చూసినా, ఏది విన్నా, "ఇది నాలో విషంలా పని చేయకూడదు" అనే జాగ్రత్త మీలో ఉండాలి.

మరి సాధన అందరూ చేయగలరా? కచ్చితంగా అందరూ

చేయగలరని శ్రీకృష్ణ భగవానుదు చెప్తాడు. అభ్యాసం ద్వారా సాధన చేయగలరు, అభ్యాసం లేకపోతే సాధనలో స్థిరపడలేరు. అందుకే కొద్ది కొద్దిగా అయినా నిరంతరం అభ్యాసం చేయాలి. ఇప్పుడు మీరు ఏదైనా ఒక పని చేస్తున్నారు అనుకోండి, అది లోక కళ్యాణం కోసం చేస్తున్న పని అయినా, "నేను చేస్తున్నాము" అని అనుకోవడం కాకుండా. "ఇది నా చేత భగవంతుడే చేయిస్తున్నాడు" అని భావించి నిష్కామంగా చేయడం నిజమైన అభ్యాసం.

ఈ నిష్కామ భావం ఇంకా పూర్తిగా అలవాటు కాకపోవడం వల్ల మీరు కొన్నిసార్లు కోరికతో పనులు చేస్తారు. కానీ కోరికతో చేసిన కర్మ పుణ్యమైనా, పాపమైనా, దాని ఫలితం జన్మకు కారణమవుతుంది. అందుకే కామ్యకర్మలు వద్దు, యజ్ఞకర్మలు చేయాలి అని గురువులు బోధిస్తారు.

గీతలో కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండకూడదని చెప్తారు, కర్మ చేయాలి కానీ ఆ కర్మఫలాన్ని పరమాత్మకు అర్పించాలి. అలా చేస్తే కర్మబంధం ఉండదు. యజ్ఞ కర్మలు భగవంతుని చేరుకునే దారిని చూపిస్తాయి, అవే నేరుగా మోక్షాన్ని ఇవ్వవు. పరమాత్మను చేరుకోవడానికి అవసరమైన సాధనకు దారి చూపించే గురువు కూడా భగవంతుని కృప వల్లే మీ జీవితంలోకి వస్తాడు. పుణ్యకర్మలు, యజ్ఞకర్మలు చేస్తూ ముందుకు సాగినప్పుడు అలాంటి అవకాశం కలుగుతుంది. ఇది తెలుసుకున్న మీరు ఆచరణలో పెట్టుకోవాలి. "నేను ఆత్మను" అనే జ్ఞానం మీ బుద్ధిలో స్థిరపడాలి. ఆ జ్ఞానం మీ బుద్ధిలో బలంగా నిలవాలి. అదే సమయంలో మీ బుద్ధికి కూడా శక్తిని ఇచ్చేది ఆత్మే అని మీరు తెలుసుకోవాలి. సత్యం మీకు అర్థమైనప్పుడు, భాహేంద్రియాల మీద కానీ, అంతరేంద్రియాల మీద కానీ మీ ఆసక్తి తగ్గి, ఆత్మ మీద మీ ఆసక్తి పెరుగుతుంది. మీ శరీరంలో ఉన్న కర్మేంద్రియాలకు, జ్ఞానేంద్రియాలకు, అంతరేంద్రియాలకు శక్తిని ఇచ్చేది ఆత్మే అని మీరు తెలుసుకోవాలి.

ఆత్మ శక్తి పెరిగితేనే మీ జీవితంలోని అన్ని శక్తులను సవ్యంగా ఉపయోగించుకోగలరు. "నా సాధన అంతా ఆత్మ శక్తిని పెంచుకోవడానికి, జ్ఞానాన్ని పెంచుకోవడానికి" అని మీరు అర్థం చేసుకున్నప్పుడు, కామ్య కర్మల అవసరం మీకు ఉండదు. ఆత్మ శక్తిని పెంచుకున్న యోగికి కావలసిన శక్తి, జ్ఞానం క్రమంగా పెరుగుతాయి. అందుకే ధ్యానంలో కూర్చుని "అది కావాలి, ఇది కావాలి" అనే కోరికలతో సాధన చేయకూడదు. యజ్ఞ కర్మలు చేస్తూ, సాధనను పెంచుకున్నప్పుడే ఇంద్రియ నిగ్రహం వస్తుంది. "కోరుకోకూడదు" అని అర్థమైనా, మీరు ఇంకా కోరుకుంటున్నారంటే ఆ నిగ్రహం పూర్తిగా రాలేదని అర్థం. ఆ నిగ్రహం రావాలంటే సాధన మీద శ్రద్ధ, తదేక దీక్ష ఉండాలి.

"ఈ భూమిమీద సాధన తప్పించి నిజంగా పొందవలసినది మరొకటి లేదు" అనే భావం మీలో బలపడాలి. అది అర్థమైనప్పుడు మీరు కర్మలు చేస్తారు, కానీ ఆ కర్మలు మీ స్వార్థం కోసం కాకుండా, లోక కళ్యాణం కోసం చేసినప్పుడు యజ్ఞ కర్మలుగా మారతాయి.

అలాగే మీ ఆత్మ శక్తిని పెంచుకునే ఆత్మ కర్మలు చేయాలి. ఎదుటి వారికి కూడా వారి ఆత్మ శక్తిని పెంచుకునే అవకాశం కల్పించాలి. మీరు ఒకరికి సాధన చెప్తే "దాని వల్ల నాకు పుణ్యం వస్తుంది" అని అనుకోవడం తప్పు. "నాకు సాధన చెప్పే అవకాశం కూడా భగవంతుడే ఇచ్చాడు" అని భావించి చెప్తే, మీరు ఎంతమందికి సాధన చెప్పినా అది యజ్ఞ కర్మ అవుతుంది కానీ కామ్యకర్మ కాదు.

అందుకే ముందుగా మీరు శక్తిమంతులు కావాలి, మీరు చేసే సాధనను సంతోషంగా చేయాలి. పెద్దలు ఒక మాట చెప్తారు, "మీరు సంతోషంగా ఉన్నప్పుడే ఎదుటివారిని సంతోషపెట్టగలరు, మీరు ఆనందంగా

జీవిస్తే, ఎదుటి వారికి కూడా ఆనందంగా జీవించడానికి అవకాశం ఇస్తారు.” అందుకే శ్రద్ధతో సాధన చేయాలి, సాధన విషయంలో తదేక నిష్ఠతో ఉండాలి. ఇవాళ సాధన చేసి రేపు మానేయడం, రేపు చేసి ఎల్లుండి మానేయడం కాదు, సాధన నిరంతరం చేయాలి.

మీరు సాధన చేస్తున్నారంటే ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఆత్మశక్తి పెరిగేది సాధన వల్లే, ఆత్మ శక్తిని పెంచుకున్నవాడు అనంతమైన శక్తిని పొందగలడు. జీవుడు దేవుడిగా మారడానికి ఉన్న గొప్ప అవకాశం సాధనే. కానీ సాధనకు ప్రధానమైన ఆటంకం ఇంద్రియ నిగ్రహం లేకపోవడమే. సాధకులకు ఇంద్రియ నిగ్రహం చాలా అవసరం. ఎప్పుడైతే ఇంద్రియ నిగ్రహం వస్తుందో, అప్పుడు ప్రాపంచిక కోరికల మీద మీకు ఆసక్తి తగ్గుతుంది.

మీ ఆత్మ శక్తిని, జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇంద్రియ నిగ్రహం ఎంతో ముఖ్యమైనది. చూసినవన్నీ కావాలి, విన్నవన్నీ కావాలి అనే కోరికలు తగ్గినప్పుడు, “ఇది నాకు నిజంగా అవసరమా? అవసరం లేదా?” అనే విచారణ మొదలవుతుంది. అదే నిత్యానిత్యవస్తువివేకం. ఈ వివేకం మీలో పెరిగిన కొద్దీ మీ ఆత్మ శక్తి కూడా పెరుగుతుంది. కామాన్ని జయించడం అంటే కేవలం కోరికను అణచడం కాదు, ఆత్మ శక్తిని పెంచుకోవడం. కోరికలను జయించాలంటే ముందుగా ఆత్మశక్తిని, జ్ఞానాన్ని పెంచుకోవాలి.

మీరు ఈరోజు ఉన్న స్థితిని, ఈ మార్గంలోకి రాకముందు మీరు ఉన్న స్థితిని పోల్చి చూసుకుంటే, చాలా కోరికలు తగ్గాయని మీకే తెలుస్తుంది. ఒకప్పుడు అందరూ మిమ్మల్ని పొగడాలి, అందరూ మీ గురించి గొప్పగా చెప్పాలి అనే కోరిక ఉండేది. ఇంకా “వాళ్ళకు ఉంది, నాకు లేదు” అనే పోలికలు, కోరికలు ఉండేవి. కానీ ఇప్పుడు మీ దృష్టి ఆ కోరికల మీదకు

వెళ్ళకుండా, “పరులు ఏమనుకున్నా, పరమాత్మ మెచ్చుకునేలా నా జీవితం ఉండాలి” అనే ఒకే ఒక మంచి కోరికతో జీవించే స్థితికి మీరు వస్తున్నారు.

అందరూ భగవంతుడికి ఇష్టులే. జ్ఞానం పొందడం మాత్రమే కాదు, అందరినీ జ్ఞాన వంతులుగా చేయాలి. లోకంలో ఎవ్వరూ దుఃఖంతో ఉండకూడదు. ఈ సాధన అందరికీ పంచాలి అనే విషయాన్ని మీరు పత్రి గారి ద్వారా నేర్చుకున్నారు. అందుకే మీలో ఉండవలసిన కోరికలు ఏమిటంటే మీరు సాధన చేయాలి, జ్ఞానం పెంచుకోవాలి, ఆ జ్ఞానాన్ని పది మందికి పంచాలి, యజ్ఞకర్మ చేయాలి. అజ్ఞాని కోరికతో కర్మ చేస్తే, జ్ఞాని యజ్ఞకర్మ చేస్తాడు. కర్మ ఫలాన్ని పరమాత్మకే అర్పిస్తాడు. కోరికతో చేసే ప్రతి కర్మ వెనుక ఎక్కడో ఒకచోట దుఃఖం ఉంటుంది. కానీ యజ్ఞకర్మ చేసే జ్ఞాని మాత్రం ఆనందంగా, తృప్తిగా జీవిస్తాడు.

అందుకే కర్మ మోక్షమార్గం కాదు. కర్మ అనేది ప్రాథమికంగా జ్ఞానంలోకి వెళ్ళడానికి ఒక దారిని సిద్ధం చేస్తుంది. మీరు నిష్కామకర్మ చేసినప్పుడు, కర్మ ఫలాన్ని పరమాత్మకు అర్పించినప్పుడు, మీ జీవితంలోకి భగవంతుడే ఒక గురువును పంపి జ్ఞానాన్ని బోధించే అవకాశం కల్పిస్తాడు. అందుకే పూర్వం “శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు” అని చెప్పేవారు. మరి ఈరోజు మీరు సాధన చేస్తూ జ్ఞానాన్ని పెంచుకుంటున్నారంటే అది పరమ శివుని అనుగ్రహమే.

మీ జీవితంలోకి గురువు రావడం, ఆయన మాట వినే అవకాశం కలగడం కూడా మీ పూర్వ జన్మ పుణ్యమే. లేకపోతే గురువు వచ్చినా, ఆయనను అర్థం చేసుకోకుండా విమర్శించే వాళ్ళు కూడా ఉంటారు. అందుకే నేను ఎవరితోనూ వాదించను. బుద్ధుడు చెప్పినట్లు, మూర్ఖులతో వాదించడం అనే పొరపాటు చేయకూడదు. ఎవరైనా గురువును విమర్శిస్తున్నారు అంటే “వారు

ఇంకా అజ్ఞానంలోనే ఉన్నారు” అని అర్థం చేసుకోవాలి.

గురువులు కూడా “ఎవరినీ విమర్శించకండి. ఎవరి స్థాయిలో వారు అలా మాట్లాడుతారు” అని చెప్తారు. సత్యం మీకు తెలిసింది కదా, మీకు సత్యం తెలిసి ఉంటే ముందుగా మీరు దాన్ని ఆచరించాలి. సత్యం ఎప్పటికైనా బయటపడుతుంది, దాన్ని దాచినా దాగదు. అందుకే ఎవరైనా మిమ్మల్ని విమర్శించినా, చిరునవ్వుతో వారి స్థితిని అర్థం చేసుకుని ముందుకు వెళ్ళాలి. “నేను ఇలా ఉంటే ఎదుటి వారికి నచ్చను, కాబట్టి పది మందికి నచ్చేలా, మెచ్చేలా నేను ఎలా జీవించాలి?” అని ఆలోచించాలి.

అందుకు నిష్కామకర్మ చేయాలి. యజ్ఞకర్మలు చేయాలి. ఆ కర్మలు చివరికి జ్ఞానానికి దారి తీయాలి. అందుకే మహా మునులు కర్మ యోగాన్ని ప్రాథమిక విద్యతో పోల్చారు. మీరు ఒక చోటికి వెళ్ళాలి అంటే ముందుగా ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకుంటారు. అదే విధంగా కర్మ యోగం కూడా మిమ్మల్ని తదుపరి స్థాయికి తీసుకెళ్ళడానికి సిద్ధం చేస్తుంది.

జ్ఞాన యోగం అంటే గమ్యాన్ని చేరుకున్న తర్వాత తెలుసుకోవడం. ఉదాహరణకు మీరు ఒక ఊరికి వెళ్ళాలి అనుకోండి. ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోవడం కర్మ. ఆ ఊరికి వెళ్ళిన తర్వాత అక్కడ స్థిరపడటం, తెలుసుకోవలసినది తెలుసుకోవడం జ్ఞానం.

అలాగే స్కూల్‌కు వెళ్ళడానికి కొన్ని ఏర్పాట్లు అవసరం. కానీ స్కూల్లోకి వెళ్ళిన తర్వాత అసలు ముఖ్యమైనది చదువుకోవడం. అదే విధంగా కర్మ యోగం ద్వారా జ్ఞాన యోగంలోకి ప్రవేశించే అవకాశం కలుగుతుంది. అందుకే కర్మ యోగం ప్రాథమిక విద్య లాంటిది. మీరు ఉన్నత విద్య చదవాలంటే ముందుగా ప్రాథమిక విద్య నేర్చుకోవాలి. అలాగే జ్ఞాన యోగం ఉన్నత విద్య లాంటిది. పరమాత్మను చేరుకోవడానికి, ఆత్మ సత్యాన్ని తెలుసుకోవడానికి చివరికి

కావలసింది జ్ఞానమే. భూమిమీద ఎన్ని జన్మలు తీసుకున్నా, మానవుడిగా ఎన్ని రకాల జన్మలు తీసుకుని ఎన్ని భోగాలు అనుభవించినా, చిట్ట చివరికి రావలసింది యోగ మార్గమే.

ఆ యోగం కోసమే మానవ జన్మ వచ్చింది. కానీ మీరు ఈ విషయాన్ని మర్చిపోయారు. అనుభవించడానికి వచ్చామని అనుకుంటున్నారు, భోగాలను అనుభవిస్తున్నారు. అయినా మీ దుఃఖం పూర్తిగా తీరడం లేదు, ఎందుకు తీరడం లేదో మీరు ఆలోచించాలి. మీకు నిజంగా కావలసింది ఇవి కావు. "ఇదే నాకు కావాలి" అని అనుకోవడమే అజ్ఞానం. మంచి భోజనం కావాలి, శరీరానికి సౌకర్యంగా ఉండే ఇల్లు కావాలి, కార్లు కావాలి, మేడలు కావాలి ఇవన్నీ కోరుకుంటారు, సంపాదిస్తారు. కానీ ఇన్ని సంపాదించినా దుఃఖం పోకపోతే, "నేను సంపాదించినవి నా దుఃఖాన్ని శాశ్వతంగా తొలగించేవి కావు" అని మీరు అర్థం చేసుకోవాలి. "నా లోపల ఏదో వెలితి ఉంది, అది ఎలా పూరించాలి?" అనే ప్రశ్న మీ అంతరాంతరాల్లో నిజంగా మొదలైనప్పుడు, భగవంతుని కృపతో సద్గురువు మీ జీవితంలోకి వస్తాడు.

భూమిమీద ఉన్న భోగాలు మీకు సుఖాన్ని, సంతోషాన్ని ఇవ్వగలవు. కానీ శాశ్వతమైన ఆనంద స్థితి ఆత్మలోనే ఉంది. మీరు ఆత్మను తెలుసుకున్నప్పుడే ఆ శాశ్వత ఆనంద స్థితిని పొందగలరు.

ఈ చిన్న రహస్యాన్ని మీకు తెలియజేసే వాడే సద్గురువు. ఆ రహస్యం తెలిసిన తర్వాత మీ ప్రయాణం ఆనందం వైపు మొదలవుతుంది. ప్రపంచం వైపు ఉన్న మీ దృష్టి క్రమంగా ఆత్మ వైపు తిరుగుతుంది. ఎప్పుడైతే మీ దృష్టిని ఆత్మ వైపు, ఆనందం వైపు తిప్పుతారో, అప్పటి నుంచి ఆ ఆనందం కొద్ది కొద్దిగా పెరుగుతుంది. ఇంకా ఆత్మ దర్శనం కలగకుండానే మీరు ఇంత ఆనందంగా ఉంటే, నిజంగా ఆత్మ దర్శనం కలిగినప్పుడు ఇంకెంత ఆనంద

స్థితిలో ఉంటారో ఆలోచించండి. ఈ భావం ఎప్పుడూ మీ స్ఫురణలో ఉండాలి, ఆత్మ మార్గంలో నడుస్తున్నప్పుడే మీరు ఇంత ఆనందంగా, ఇంత తృప్తిగా ఉంటారు.

పూర్వం రోజుల్లో మీ ఇంటికి ఒక అతిథి వచ్చినా, ఎవరైనా వచ్చినా, వారికి పెట్టడానికి కూడా కొంత ఆలోచించాల్సి వచ్చేది. మీరు తినకపోయినా, వారికి పెట్టేవారు, వారు వెళ్ళిన తర్వాత మళ్ళీ వండుకోవాల్సి వస్తుందేమోనని ఆలోచించేవారు. కానీ ఈరోజు ఈ మార్గంలోకి వచ్చిన తర్వాత పది మందికి పెట్టే కొద్దీ మీకు తృప్తి పెరుగుతోంది. మీరు తిన్నా, తినకపోయినా అతిథులకు పెట్టడం ద్వారా మీకు ఆనందం కలుగుతోంది. పూర్వం "అతిథి దేవోభవ" అని చెప్పేవారు. అతిథిని దేవుడితో సమానంగా భావించి సేవ చేయాలని నేర్పించేవారు, అది కర్మమార్గంలో ఒక ఆచరణ.

కానీ ఇప్పుడు మీకు జ్ఞానం వచ్చింది. "అతిథి దేవుడే; అందరూ ఆత్మ స్వరూపులే" అనే సత్యాన్ని మీరు తెలుసుకున్నారు. అందుకే ఇప్పుడు ఎవరైనా ఇంటికి వస్తే, వారిని ఆకలితో పంపకూడదు అనే భావంతో ఆనందంగా సేవ చేస్తున్నారు. ఇప్పుడు మీ ప్రయాణం ఆనంద స్వరూపుడైన ఆత్మ వైపు సాగుతోంది. మీ బాహ్య దృష్టి అంతర్ దృష్టిగా ఎప్పుడు మారుతుందో, అప్పుడే మీరు స్వార్థ బుద్ధిని వదిలి పరోపకార బుద్ధితో జీవించడం మొదలుపెడతారు.

కర్మ మార్గంలో స్వార్థం ఉండవచ్చు, కానీ జ్ఞాన మార్గంలో స్వార్థం ఉండదు. ఇదే కర్మ మార్గానికి, జ్ఞాన మార్గానికి ఉన్న ప్రధానమైన తేడా. కర్మ మార్గంలో "నేను బాగుండాలి, నేను మంచి స్థితికి వెళ్ళాలి, నేను మోక్షానికి వెళ్ళాలి" అనే ఆలోచన ఉండవచ్చు. కానీ జ్ఞాన మార్గంలో "అందరూ సుఖంగా ఉండాలి" అనే భావంతో జీవిస్తారు. "సర్వేజనా సుఖినో భవంతు" అనే భావంతో

జీవించడం జ్ఞానమార్గం.

అందుకే కర్మ మార్గం జ్ఞాన మార్గానికి పునాది మాత్రమే. జ్ఞాన మార్గమే మీకు పరమాత్మను చేరుకునే దిశను చూపిస్తుంది. ఆనందంగా జీవించే స్థితిని ఇస్తుంది. మోక్షానికి దగ్గర చేస్తుంది. దీనికి మూలం జ్ఞానమే. అందుకే మీరు ముందుగా కర్మ మార్గాన్ని నేర్చుకోవాలి, నిష్కామకర్మ చేయాలి. కర్మ ఫలాన్ని పరమాత్మకు అర్పించాలి, యజ్ఞ కర్మలు చేయాలి, ఆత్మ కర్మలు చేయాలి అని మొదట కర్మ మార్గాన్ని నేర్పుతారు. ఎందుకంటే ఇలాంటి కర్మలు చేసినప్పుడు మీ మనస్సు క్రమంగా శుద్ధమవుతుంది. మనస్సు శుద్ధమైనప్పుడు జ్ఞానం బుద్ధిలో స్థిరపడుతుంది. మనస్సు శుద్ధంగా లేకపోతే జ్ఞానం ఎంత చెప్పినా సరిగా ఎక్కదు.

అందుకే గురువులు ముందుగా మీకు శుద్ధమైన జీవనాన్ని నేర్పుతారు. ఆ తర్వాత జ్ఞాన మార్గాన్ని చూపించి, బుద్ధిలో జ్ఞానం స్థిరపడేలా చేస్తారు. అందుకే ప్రాథమిక విద్య కర్మ మార్గం, ఉన్నత విద్య జ్ఞాన మార్గం. ఈ సత్యాన్ని మీరు తెలుసుకుని, నమ్మి, ఆచరిస్తూ ముందుకు సాగితే మీ జీవితంలో నిజమైన ఆనందం పెరుగుతుంది.

ఈ సత్యాన్ని తెలుసుకున్న మీరు, ముందుగా ఇతరులకు కర్మ సిద్ధాంతాన్ని అర్థమయ్యేలా చెప్పాలి. నిష్కామకర్మ చేయడం ఎంత గొప్పదో, అది సాధనకు ఎలా అనుకూలంగా ఉంటుందో తెలియజేయాలి. మీరు ముందుగా ఆచరించాలి. మీరు ఆచరిస్తూ, ఎదుటివారిని కూడా ఆచరించేలా ప్రేరేపించాలి. నిష్కామకర్మ ఎందుకు చేయాలి? ఇంద్రియ నిగ్రహం రావడానికి. ఇంద్రియ నిగ్రహం రావాలంటే నిష్కామకర్మ అవసరం. ఇలా ఒక్కొక్క విషయాన్ని మీరు తెలుసుకుంటూ, ఆచరిస్తూ, పదిమందితో కూడా ఆచరింపజేస్తూ ముందుకు వెళ్ళడమే అసలైన జ్ఞానానికి అర్థం.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
12) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
13) భగవంతుడంటే - రూ.100/-
14) తెలుసుకోండి - రూ.100/-
15) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
16) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
17) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
18) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
19) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
20) కఠోపనిషత్తు - రూ.90/-
21) ఉపమాన జ్ఞాన సందేశాలు - రూ.90/-
22) గీతాసందేశం - రూ.80/-
23) ముఖ్యమైన సందేశాలు-1 - రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 - రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) పత్రీజీ జ్ఞాన సందేశాలు-1 - రూ.80/-
30) పత్రీజీ జ్ఞాన సందేశాలు-2 - రూ.80/-
31) పత్రీజీ జ్ఞాన సందేశాలు-3 - రూ.90/-
32) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
33) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
34) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
35) జ్ఞాన జ్యోతి - రూ.70/-
36) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
37) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
38) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
39) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
40) బుద్ధుని సందేశాలు - రూ.70/-
41) భూతదయే దైవత్వం - రూ.70/-
42) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
43) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
44) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
45) ఆశ్చర్యకరమైన విషయాలు - రూ.70/-
46) మానవునిలోని చెడు - రూ.70/-
47) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు - రూ.70/-
48) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
49) మోక్షం అంటే? - రూ.70/-
50) కబీరు సందేశాలు-1 - రూ.70/-
51) మనసు-1 - రూ.70/-
52) మనసు-2 - రూ.70/-
53) " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? " రూ.70/-
54) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే - రూ.70/-
55) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
56) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
57) ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు- రూ.70/-
58) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
59) కబీరు సందేశాలు-2 - రూ.60/-
60) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
61) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
62) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
63) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
64) అతీంద్రియ శక్తులు - రూ.60/-
65) ఆలోచించండి - రూ.60/-
66) నిర్వాణ మార్గం - రూ.60/-
67) ధ్యానులకు సూచనలు - రూ.60/-
68) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
69) మమకారం - రూ.60/-
70) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
71) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
72) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
73) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
74) సంకల్పమంటే? - రూ.50/-
75) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
76) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
77) అరిహంత్ - రూ.50/-
78) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
79) ఈ జీవితం ఎందుకు? - రూ.40/-
80) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
81) విదురుని సందేశాలు - రూ.40/-
82) మూడురకాల జీవితాలు - రూ.40/-
83) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
84) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
85) బ్రహ్మం అంటే? - రూ.40/-
86) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
87) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
88) మహాత్ముల సందేశాలు - రూ.40/-
89) సత్యం - రూ.40/-
90) చక్రాలు - రూ.40/-
91) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
92) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
93) మౌన ధ్యానం - రూ.40/-
94 )మనంఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
95) శాకాహారమే మానవాహారం - రూ.15/-
96) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు సాగకుండా వెనక్కి లాగే ప్రధాన కారణాల్లో మనిషిలో ఉండే 'సోమరితనం' ఒకటి. సాధకుడికి బయట ఉన్న శత్రువుల కంటే, తనలో ఉన్న సోమరితనమే పెద్ద అడ్డంకిగా మారుతుంది. మీరు ఆధ్యాత్మిక పురోగతి సాధించాలంటే ఈ సోమరితనాన్ని తప్పకుండా అధిగమించాలి. చిన్నదిగా కనిపించే సోమరితనం మనిషిని ఎంత దిగువ స్థితికి తీసుకెళ్ళగలదో! అదే సోమరితనాన్ని వదిలినప్పుడు ఎంత ఉన్నత స్థితికి ఎదగగలరో! మీరు మీ జీవితంలో అనుభవించాలి. గురువులు మార్గాన్ని చూపిస్తారు. ఆ మార్గంలో నడవాల్సింది శిష్యులే. శిష్యుల్లో ఆచరణ ఎందుకు ఉండడం లేదు అని పరిశీలిస్తే, ముందుగా విన్న విషయాలపై శ్రద్ధ లేదు. విన్నా అర్థం కావడం లేదు అంటే అర్థం చేసుకోవడానికి ప్రయత్నం లేదు. ప్రయత్నం లేకపోవడానికి కారణం సోమరితనం. అందుకే బద్ధకం, సోమరితనం, శ్రద్ధ లేకపోవడం ఈ మూడు ఆధ్యాత్మిక ఎదుగుదలకు పెద్ద అడ్డంకులు. వీటిని వదిలి శ్రద్ధతో సాధన చేస్తే మీరు అత్యున్నత స్థాయికి ఎదగగలుగుతారు.

రూ.50/-

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|